ఖేల్‌రత్నకు జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోండి

- కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖకు హైకోర్టు ఆదేశం

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 177 | విజయవాడ, బుధవారం 29 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 29 January 2025 | Rs



38వ జాతీయ క్రీడలు ప్రారంభం

- ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాని

8

టిడిపి పార్లమెంటరీ పార్టీ నేతలతో మాట్లాడుతున్న చంద్రబాబు

వికలాంగుల కోసం రూ.200 కోట్లతో స్టేడియం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగుల కోసం విశాఖలో రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో స్టేడియం నిర్మిస్తున్నట్లు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. సచివాలయంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పులువురు వికలాంగులు... మంత్రి డోలాను మంగళవారం కలిశారు. 7వ రాష్ట్ర పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ... వికలాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వికలాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లు, త్రీ వీలర్స్ అందజేస్తున్నట్లు చెప్పారు. వీరికి ప్రతినెలా ఇచ్చే పింఛనును రూ.6 వేలకు పెంచామన్నారు. మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ.15 వేలు ఇస్తున్నట్లు చెప్పారు.

స్తంభించిన బంగ్లాదేశ్ రైల్వే

దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె

7

బడ్జెట్‌లో ప్రాధాన్యం

• ప్రాజెక్టులకు నిధులు • ఎంపిలకు చంద్రబాబు దిశానిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సాధ్యమైనంత మేర ప్రాధాన్యం లభించేలా చూడాలని, అదే సమయంలో వివిధ ప్రాజెక్టులకు, పథకాలకు నిధులు సాధించాలని టిడిపి ఎంపిలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు ఫిబ్రవరి1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టిడిపి పార్టీమెంటరీ పార్టీ సమావేశం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బాబు మాట్లాడుతూ నూతన రైల్వే ప్రాజెక్టుల సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నడికుడి-కాళహస్తి రైల్వే లైన్, రేణిగుంట- గూడూరు, కోటిపల్లి- నర్సాపూర్, కడప- బెంగళూరు ప్రాజెక్టుల త్వరిత గతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేనటీయించేలా చూడాలన్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యేలు, కలెక్టర్లుతో సమన్వయం చేసుకుని విజన్ డాక్యుమెంటు సిద్దం చేయాలన్నారు. విశాఖపట్టణం, విజయవాడలకు మెట్రో రైలు ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సూచించారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని సముద్ర తీరం మనకు ఉందని, పోర్టుల నిర్మాణం ద్వారా సద్వినియోగం చేసుకుంటే పెద్దఎత్తున ఉపాధి లభించడంతో పాటు సంపద సృష్టి జరుగుతుందన్నారు. కొత్త రహదారులు రాష్ట్రానికి కేటాయించేలా రహదారుల విస్తరణకు అనుమతులు వచ్చేలా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలపై నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం విదేశాల్లో అమలవుతున్న ప్రాజెక్టులు, పాలసీలపై ఎంపిలు అవగాహన పెంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడతాయో అధ్యయనం చేసి సంబంధిత మంత్రులకు తెలపాలన్నారు. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టు గేమ్ ఛేంజర్‌లా పనిచేస్తుందని, అది పూర్తయితే రాష్ట్ర రైతాంగానికి పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. ఉపాధిహామీ వంటి పథకాలకు అనుమతులిచ్చే విషయంపై స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి కేటాయించాలని చంద్రబాబునాయుడు సూచించారు. సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేటప్పుడు జిఎస్‌టి లేకుండా చూడాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రస్తావించగా సిఎం సానుకూలంగా స్పందించారు. టిడిపిపార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు -2024 జాయింట్ పార్లమెంట్ కమిటీకి వెళ్లడానికి టిడిపి ఎంపిల కృషే కారణమని, బిల్లుకు 14 సవరణలు ఆమోదించగా ఇందులో 4 టిడిపి ప్రతిపాదించినవే అని అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు ఎంపీలు హాజరు దేశ వ్యాప్తంగా ఉన్న సగటు కంటే ఎపి టిడిపి ఎంపిలు హాజరు అధికంగా ఉందన్నారు. అదే విధంగా సభ్యులు ప్రశ్నలు అడగడంలో జాతీయ సగటు 9శాతం ఉంటే రాష్ట్రానిది 20శాతంఉందని సిఎం తెలిపారు. ఎంపిల సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రరాజకీయాలు, విజయసాయిరెడ్డి రాజీనామాతో పాటు దావోస్ పర్యటన తదితర అంశాలు ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ

60 మందితో రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ నూతన రాష్ట్ర కమిటీ 60 మందితో ఏర్పడింది. అందులో 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా జి నాగయ్య, ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, చుక్క రాములు, టి జ్యోతి, టి సాగర్, ఎండి అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి ప్రభాకర్. బి రవికుమార్, నున్న నాగేశ్వరరావు, ఎండి జహంగీర్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీకి ఆహ్వానితులుగా ఏడుగురు, ప్రత్యేక ఆహ్వానితులు ఐదుగురు ఎన్నికయ్యారు. సంగారెడ్డి పట్టణంలో గత నాలుగు రోజులుగా కొనసాగిన సిపిఎం రాష్ట్ర నాలుగో మహాసభ జయప్రదంగా ముగిసింది. చివరి రోజైన మంగళవారం కార్యదర్శి, నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికతో మహాసభ ప్రక్రియ దిగ్విజయమైంది. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులను, రాష్ట్ర కమిటీ సభ్యులను పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బివి.రాఘవులు, ఇప్పటివరకూ కార్యదర్శిగా పనిచేసి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం తదితర నేతలు అభినందించారు. రాష్ట్రంలో సిపిఎంకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని, ఆ కృషిలో నూతన రాష్ట్ర కమిటీ సఫలీకృతం కావాలని దిశానిర్దేశం చేశారు. అందుకు తమవైపు నుంచి సంపూర్ణ సహాయసహకారాలు ఉంటాయన్నారు.

టీచర్లకు ఒక్కటే యాప్

- త్వరలో సిద్ధం చేయండి
- ఎపి మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూప్రింట్‌పై ప్రజాభిప్రాయం
- సమీక్షలో లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తొలగించే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకే యాప్‌ను రూపొందించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను గుర్తు చేశారు. ఆ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైంత త్వరలో ఒకే యాప్‌ను రూపొందించి అందచేయాలని ఆదేశించారు. ఎపి మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్‌పై ప్రజాభిప్రాయం సేకరించాలని, దీనికోసం బ్లూ ప్రింట్‌ను త్వరగా సిద్ధం చేయాలని చెప్పారు. ఉపాధ్యాయ బదిలీ చట్టంపైన ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని మంత్రి అధికారులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శనివారం "నో బ్యాగ్ డే" గా ప్రకటించి విద్యార్థులకు కరిక్యులమ్ యాక్టివిటీస్ రూపొందించాలని ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధారించేందుకు ఆపార్‌ఐడిని అనుసంధానించే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పాఠశాల విద్యలో గత వైసిపి ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన జీఓ నెంబరు 117 ఉప సంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచిఅభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని అన్నారు. ఈ సమవేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రామికవర్గ రాజ్యంతోనే ప్రజాసమస్యలకు విముక్తి

- సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు
- సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా విశాఖ నుంచి ఉక్కు రక్షణ జాతా ప్రారంభం

ఉక్కు రక్షణ జాతా ప్రారంభ సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

శ్రామికవర్గ రాజ్యం వచ్చినప్పుడే దేశంలోని ప్రజలందరి సమస్యలకూ విముక్తి దొరుకుతుందని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిపిఎం 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ నెల్లూరులో జరగనున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు తలపెట్టిన రాష్ట్ర జాతాను కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి మంగళవారం ఆయన ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ఆపాలని కోరుతూ ఈ జాతా పలు జిల్లాల్లో సాగుతూ 31వ తేదీన నెల్లూరులో ముగియనుంది. జాతా ప్రారంభ సభలో సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ పెట్టుబడిదారీవర్గం ఉన్నంత కాలం ప్రజలకు సరైన ఉపాధి దొరకదన్నారు. ధరలు నిత్యం పెరుగుతూనే ఉంటాయని తెలిపారు. భారతదేశంలో విభిన్న పరిస్థితులు, జాతులు, రాజకీయాలు ఉన్నాయన్నారు. అందులో కమ్యూనిస్టులవి ప్రత్యేకమైన రాజకీయాలని వివరించారు. దేశంలో కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాల్సిన అవసరముందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టాలని చూస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి విలువైన ఆస్తులను తక్కువ ధరలకు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ సొంత గనులు కేటాయించకుండా ప్రాధాన్యతను తగ్గిస్తూ వస్తున్నాయన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి ఇప్పటికైనా ప్రభుత్వాల అధినేతలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని, ప్లాంట్‌ను రక్షించాలని కోరారు. ఇంకా ప్రారంభమే కాని ప్రైవేటు ఆర్సెలార్ మిట్టల్ సంస్థకు గనులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నారని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనుల కోసం మాత్రం కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదని అన్నారు. ప్రభుత్వ రంగంలోని ఉక్కు పరిశ్రమను పరిరక్షించడానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును మిగతా 7లో

అంత్యక్రియలకు రూ.15 వేలు సాయం

సర్వీసులో మరణించిన అంగన్‌వాడీ సిబ్బందికి వర్తింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సర్వీస్‌లో ఉండి మరణించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అంత్యక్రియలకు రూ.15 వేలు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జిఓ ఆర్‌టి నెంబరు 9ని విడుదల చేసింది. మరణించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు చెందిన చట్టబద్ధమైన వారసులకు ఈ మొత్తం సొమ్మును చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రూ.20 వేలకు పెంచాలి : యూనియన్

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సర్వీసులో ఉండి మరణించిన వారి అంత్యక్రియలకు రూ.15 వేలు ఇచ్చేందుకు విడుదల చేసిన జిఓ ఆర్‌టి నెంబరు 9ని సవరించి రూ.20 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కారుసాల సుబ్బరావమ్మ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

1/70 చట్టంపై అయ్యన్న వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలకు సడలించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యల పట్ల ఆదివాసీ ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'ప్రజాశక్తి'తో పలువురు ఎమ్మెల్యేలు, ఆదివాసీ నేతలు

బాధ్యతాయుత పదవిలో ఉన్న అయ్యన్న అటువంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆదివాసీ చట్టాల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఏజెన్సీలో నిరసన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

విశాఖ వేదికగా ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన జరిగిన సోమవారం పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై మంగళవారం పలువురు స్పందించారు. వారి మాటల్లోనే..

చట్ట సవరణలతో ఆదివాసీలకు ముప్పు

పర్యాటకాభివృద్ధి పేరుతో 1/70 చట్టానికి సవరణలు తీసుకొస్తే గిరిజనుల మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాల్సిన వారే, అందునా స్పీకర్ లాంటి ఉన్నత వ్యక్తే అలా మాట్లాడడం సమంజసం కాదు. చట్టం సక్రమంగా అమలు జరగకపోవడం వల్ల ఇప్పటికే ఏజెన్సీలో గిరిజనేతరుల ఆక్రమణల జోరు ఎక్కువైంది. టూరిజం కోసం పెట్టుబడిదారులను ప్రోత్సహించడం కంటే ప్రభుత్వమే నేరుగా గిరిజనుల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

-రేగం మత్స్యలింగం, అరకు శాసన సభ్యులు

గిరిజన సంపదను కాపాడాలి

గిరిజన సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే వారు ఆర్థికంగా అభివృద్ధి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. గిరిజన ప్రాంత ప్రజలకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని సవరించాలని కోరడం సమంజసం కాదు. జిసిసిని, ఎపిటిడిసిని బలోపేతం చేసి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలే తప్ప, గిరిజన ప్రాంత భూముల్లోకి అభివృద్ధి పేరిట కార్పొరేట్ శక్తులకు, వ్యాపారవేత్తలకు అవకాశం ఇవ్వకూడదు.

లోకం నాగ మాధవి, నెల్లిమర్ల శాసన సభ్యులు

గిరిజన భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

స్పీకర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. హోటళ్లు, లాడ్జీలు కడితే ఏజెన్సీ అభివృద్ధి చెందదు. ఆదివాసీల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తే, ఇక్కడ మౌలిక సదుపాయాలు సమకూరిస్తే అభివృద్ధి చెందుతుంది. గిరిజనుల భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర సాగుతోంది.

-కూడా రాధాకృష్ణ, గిరిజన సమాఖ్య అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి

మరి కొందరి స్పందనలు 7లో

వైభవంగా శంబర జాతర

- పోటెత్తిన సందర్శకులు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

8

సిఎం చంద్రబాబుకు ఊరట

సిబిఐకి కేసులు బదిలీ చేయడానికి నిరాకరించిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసుల విచారణను సిఐడి నుంచి సిబిఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. చంద్రబాబుపై నమోదైన ఏడు కేసులను సిబిఐకి బదిలీ చేయాలని హైకోర్టు న్యాయవాది బి బాలయ్య.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ బాలచంద్ర వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ వాదనలు వినిపించేందుకు ప్రయత్నించారు. ధర్మాసనం జోక్యం చేసుకుని ఇది పూర్తిగా పనికిమాలిన పిటిషన్ అని పేర్కొంది. సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ ఆగకుండా వాదనలు వినిపించడానికి సిద్ధమయ్యారు. దీంతో ఆయనపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌కు సంబంధించిన ఒక్కమాట మాట్లాడినా భారీ జరిమానా విధిస్తామని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో కూడా మీలాంటి సీనియర్లు హాజరవుతారని అసలు ఊహించలేదని మణీందర్ సింగ్‌ను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక్కమాట కూడా వినకుండానే పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది.

లైంగిక వేధింపుల విచారణకు ప్రత్యేక సెషన్ కోర్టులు!

2

- ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ : డిజిపి

అన్ని శాఖల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర

- కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని శాఖల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు, నోడల్ ఆఫీసర్లతో పట్టాభిరామ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర దినోత్సవంలో ప్రభుత్వ ఉద్యోగులను, ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. దీనికోసం రాష్ట్ర, జిల్లాస్థాయి నోడల్ అధికారులనూ నియమించామని తెలిపారు. సలహాలు, సూచనల కోసం ప్రత్యేక యాప్‌ను తయారు చేస్తామన్నారు. ఎన్‌జిఒలు, స్పోర్ట్స్ అసోసియేషన్లు, అన్నిటినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని ఆయన తెలిపారు.

కమిషనర్లు కష్టపడి పనిచేయాలి

- డైరీ ఆవిష్కరణలో మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కమిషనర్లు కష్టపడి పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను అమలు చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ల సంఘం ప్రచురించిన 2025 డైరీని మంత్రి నారాయణ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులను అభినందించారు. భవనాలు, లేఅవుట్ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగించామని, కమిషనర్ల చొరవతో వ్యవహరించాలని సూచించారు. దీనిపై సంఘం నాయకులూ హర్షం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ బాధ్యతలు అప్పగించడంపై తమ బాధ్యత పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగ నరసింహారావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

వరదల్లో దెబ్బతిన్న ఆటోలకు పరిహారం పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2024 ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో వరదలకు దెబ్బతిన్న ఆటోలకు పరిహారం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో పరిహారం కింద రూ.10 వేలు ఇవ్వగా, తాజాగా ప్రభుత్వం ఆ పరిహారాన్ని రూ.20 వేలకు పెంచింది. ఈ మేరకు మంగళవారం జిఓ ఎంఎస్ నెంబరు 2ను విడుదల చేసింది. బాధితులకు ఉదారంగా పరిహారం ఇవ్వాలని అధికారులను సిఎం చంద్రబాబు దేశించారు.

నేను రాజీనామా చేయను : అయోధ్యరామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ మారే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. విజయ్‌సాయి రెడ్డి బాధ్యత కలిగిన వ్యక్తి, కష్టపడే మనస్తత్వం ఉన్న నాయకుడని, కానీ రాజకీయాల నుంచి ఎందుకు తప్పుకుంటున్నారో విజయసాయిరెడ్డి స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. రాజకీయాలలో ఒడిదుడుకులు సర్వసాధారణమని చెప్పారు. రాజకీయాలలో గెలిచినప్పుడు బాగానే ఉంటుందని, ఓడినప్పుడు కొన్ని సమస్యలు ఉంటాయని, అవి తట్టుకొని నిలబడే శక్తి ఉండాలన్నారు. ఇది ఏ రంగంలోనే అయినా ఇలాగే ఉంటుందన్నారు. మనిషి జీవితంలో అన్ని రంగాలలో రాణించిన తర్వాతే రాజకీయాల్లోకి రావాలని సూచించారు. రాజకీయాల్లో అప్ అండ్ డౌన్స్ ఉంటాయని, అవి ఎదుర్కొని నిలబడగలగటమే రాజకీయమన్నారు.

23న యుపిఎస్‌సి మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన హైదరాబాద్ ఎక్సెల్ సివిల్స్ అకాడమీలో యుపిఎస్‌సి మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ రాజేంద్ర కుమార్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 23న ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 75 శాతం వరకూ మెరిట్ స్కాలర్షిప్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇతర వివరాల కోసం 91004-33442, 91004-33445 నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

నివాస ప్రాంతాల్లో కృషి పెంచండి

- సరళీకరణ విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలి
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలో బివి రాఘవులు

సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దేశంలోని వ్యవసాయం, పరిశ్రమలతోపాటు అనేక ఇతర రంగాల్లో కొత్త పరిస్థితులు నెలకొంటున్నాయని, వాటిని అర్థం చేసి దీనికి అనుగుణంగా ఉద్యమాలకు రూపకల్పన చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాల్లో ప్రజాసమస్యలపై కృషి పెరగాలని, తద్వారా రానున్న మూడేళ్లలో సిపిఎంను ప్రభావిత శక్తిగా రూపొందించాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో మంగళవారం సిపిఎం నాలుగో రాష్ట్ర మహాసభ ముగింపులో ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. హిందుత్వ, మతోన్మాద వ్యతిరేక పోరాటంలో సైద్ధాంతిక పోరాటాలను మిళితం చేయాలని సూచించారు. సామాజిక రంగంలో వైవిధ్యంగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం వివిధ దేశాల్లో ఆర్థిక మాంద్యం, ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆ ప్రభావం మనదేశంపై ఎలా ఉండబోతున్నదనే అంశాన్ని ప్రజలకర్థమయ్యే రీతిలో చెప్పాలని సూచించారు. ఐటి, ఇంజనీరింగ్ రంగాల్లో వస్తోన్న మార్పులనూ అధ్యయనం చేయాలని సూచించారు. ఇలాంటి కృషి చేయడం ద్వారా తెలంగాణలో రాబోయే రోజుల్లో పార్టీ ప్రజా పునాదిని బలోపేతం చేయాలని రాఘవులు పిలుపునిచ్చారు.

మా భూములు ఇచ్చేది లేదు

- హైవే పనుల సర్వేను అడ్డుకున్న రైతులు
- మద్దతుగా నిలిచిన ఏపి రైతు సంఘం, సిపిఎం, టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

జాతీయ రహదారి కోసం మా భూములను ఇచ్చేదే లేదంటూ నంద్యాల టూ జమ్మలమడుగు హైవే పెగ్ మార్క్ ఎక్స్‌టెన్షన్ సర్వే పనులను రైతులు మంగళవారం అడ్డుకున్నారు. ఏపి రైతు సంఘం, సిపిఎం, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, గ్రామసభలో ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసినా, రైతుల విన్నపాన్ని ఏ మాత్రం లెక్క చేయకుండా నేషనల్ హైవే అధికారులు 167 కె రహదారి కోసం బలవంతంగా వందలాది మంది పోలీస్ బందోబస్తుతో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వే చేయడానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏపి రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో కానాల, రైతు నగర్, గ్రామాల రైతులు అధికారులను అడ్డుకున్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, సిపిఎం మండల కార్యదర్శి వి బాల వెంకట్, టిడిపి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి రైతు నగరం, కానాల గ్రామ రైతు పెద్దలు శంకరావ్, గాండ్ల మనోహర్, తెలుగు చిన్నమ్మ, ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో రైతులందరూ సర్వే అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎంపికి, జిల్లా కలెక్టర్‌కు, నేషనల్ హైవే జిల్లా, జాతీయ అధికారులకు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. సర్వే అధికారులు పెగ్ మార్కింగ్ పేరుతో రైతుల పచ్చని పొలాల్లో పోలీసులతో బలవంతంగా భూ సేకరణ చేపడితే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సర్వే చేయకుండా వెనక్కి వెళ్లాలని కోరారు. ఆందోళన చేస్తున్న రైతాంగానికి టిడిపి నాయకులు భూమా బ్రహ్మానంద రెడ్డి మద్దతు తెలిపారు. నిన్న హైవే అధికారులతో మాట్లాడామని, గత ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములు కాపాడడం కోసం పేద, మధ్యతరగతి రైతుల భూముల్లో సర్వే చేయించిందన్నారు. వెంటనే ముఖ్యమంత్రితో కూడా మాట్లాడి రైతులకు నష్టం కలగకుండా చూస్తామని, అందుకు కొంత సమయం ఇవ్వాలని, అప్పటివరకు అధికారులు సర్వే పనులను ఆపాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు వెంకటేశ్వర్లు, సాకలి మద్దిలేటి, శీను, టిడిపి నాయకులు గుర్నాథ్‌రెడ్డి, జమాల్ రైతులు పాల్గొన్నారు.

'సెంచరీ' దిశగా 'షార్'

- కౌంట్‌డౌన్ ప్రారంభం - నేడు ప్రయోగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అత్యంత ప్రతిష్టాత్మక రాకెట్ ప్రయోగానికి సిద్ధమయ్యింది. వందవ రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ కీలక ప్రయోగం బుధవారం ఉదయం 6.23 గంటలకు జరగనుంది. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల 53 నిమిషాల నుంచి కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. నిరంతరంగా 27 గంటల 30 నిమిషాల వరకు కొనసాగనుంది. జిఎస్‌ఎల్‌వి-ఎఫ్ 15 పేరుతో ఈ రాకెట్‌ను నిర్మించారు. భూ, జల, వాయు మార్గాలలో వాహన శోధకులకు ఉపయోగపడేందుకు నావిక్ 2వ సిరీస్‌లో ఎన్‌విఎస్ 02 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. 2,250 కిలోల బరువు ఉన్న ఈ ఉపగ్రహం అంతరిక్షం నుంచి జిపిఎస్ తరహా సేవలను అందించనుంది. కేవలం మన భూభాగంలోనే కాకుండా చుట్టుపక్కల 1500 కిలోమీటర్ల దూరంలోనూ ఈ సేవలు అందుతాయి. భూమి నుంచి 170 కిలోమీటర్ల పెరజి, 36,577 కిలోమీటర్ల అపోజిల జియో స్టేషనరీ ఆర్బిట్‌లో ఈ ఉపగ్రహం చేరి దేశానికి సేవలు అందించనుంది. జిఎస్‌ఎల్‌వి -ఎఫ్ 15 రాకెట్ సిరీస్‌లో ఇది 17వది. ఈ రాకెట్ ఎత్తు 50.9 మీటర్ల కాగా, 420.7 టన్నులు బరువు ఉంటుంది. మూడు దశలలో ఈ రాకెట్‌ను ఇస్రో రూపొందించింది. ఇప్పటివరకు జరిగిన 99 రాకెట్ ప్రయోగాల్లో 89 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలతో పాటు వివిధ ప్రయివేటు సంస్థలు, యూనివర్సిటీల విద్యార్థులు రూపొందించిన 592 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపారు. ఇందులో తొమ్మిది రీఎంట్రీ ఉపగ్రహాలూ ఉన్నాయి.

పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనండి

- మంత్రులు, ఎంఎల్‌ఎలకు బాబు సూచన
- జూన్ లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎంపిలు, మంత్రులు,ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని చెప్పారు. గత ఏడు నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామని, స్వల్పకాలంలో ప్రభుత్వ పరంగా చేపట్టిన విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని, ఈ విషయంలో వైసిపి తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని నేతలకు సూచించారు.

కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాదాయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు క్యూబ్స్ (క్లస్టర్, యూనిట్, బూత్ సెక్షన్) విభాగాల్లో సభ్యులుగా ఉండాలని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. క్యూబ్స్‌సభ్యులుగా ఉన్న వారినే పదవుల కోసం నాయకులు సిఫారసు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్‌బోర్డులు ఉన్నాయని రానున్న రోజుల్లో నియామకాలన్నీ పూర్తి చేస్తామని సిఎం వెల్లడించారు. జూన్‌లోపు ప్రభుత్వంలోని అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామన్నారు. మెంబర్ షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహమిస్తామని పదవి పొందిన వాళ్ళ పనితీరుపై రెండేళ్లచ తరువాత సమీక్ష చేస్తామని, దాని ఆధారంగా మళ్లీనిర్ణయాలు, భవిష్యత్తు అవకాశాలు ఉంటాయన్నారు. మంత్రులు జిల్లాల్లో ఎమ్మెల్యేలతో కూర్చొని పార్టీ అంశాలపై చర్చించాలన్నారు.

శాఖల వారీ సమీక్షలపై కేబినెట్‌లో చర్చిస్తాం : దుర్గేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, పక్కన మంత్రి నాదెండ్ల మనోహర్

జిల్లా స్థాయిలో శాఖల వారీగా సమీక్షించిన అంశాలపై త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గుంటూరులోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు జిల్లాలకు రాకపోవడం, శాఖల వారీగా సమీక్ష చేయకుండా కేవలం డిఆర్‌సి సమావేశాలకే పరిమితం కావడంపై ప్రభుత్వ లక్ష్యాలు పూర్తికావడం లేదనే అంశంపై సిఎంతో చర్చిస్తామన్నారు. జిల్లా, నియోజకవర్గం స్థాయిలో శాఖల వారీగా వర్క్ షాపులు నిర్వహించాలని, ప్రజా ప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో అధికారులు చర్చించాలన్నారు. రాష్ట్రంలో టూరిజం సర్క్యూట్‌లో కేవలం ఆలయాలను మాత్రమే చేర్చాలన్న ఉద్దేశం లేదని, ఇందులో ఇతర చారిత్రక ప్రదేశాలు, పేరెన్నికగల చర్చిలు, దర్గాలు, మసీదులు కూడా చేరుస్తామని వెల్లడించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్లు నిర్ణయం తీసుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రదేశాల్లో పెట్టుబడులు తెప్పించి అభివృద్ధి చేస్తామని, అప్పుడు ప్రజలకు ఆనందం, ప్రభుత్వానికి ఆదాయం వస్తాయన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు నశీర్ అహ్మద్, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్, గల్లా మాధవి తదితరులు పాల్గొన్నారు.

70 శాతం రోడ్ల మరమ్మతులు పూర్తి

- ఆర్అండ్‌బిశాఖ మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి
- దివాళా స్థితిలో ఫైబర్‌నెట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గుంతల రహిత రోడ్ల కార్యక్రమాన్ని 70 శాతం పూర్తి చేశామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్థనరెడ్డి తెలిపారు. ఆరేడు జిల్లాల్లో వర్షాల వల్ల మరమ్మతుల్లో ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. విజయవాడ ఎన్‌టిఆర్ అడ్మినిస్ట్రేటివ్ భవనంలో మంగళవారం నాడు మంత్రి.. ఎపి ఫైబర్‌నెట్, డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి 22 వేల కిలోమీటర్ల మేర రహదారులు గుంతలమయం అయ్యాయని తెలిపారు. ఐదేళ్లలో రూ.47 వేల కోట్లు రోడ్లపై ఖర్చు చేశామని వైసిపి నాయకులు ప్రచారం చేశారని, అంత ఖర్చు చేస్తే గుంతలు ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.1,180 కోట్లతో గుంతల రహిత రోడ్ల కార్యక్రమం చేపట్టామన్నారు. ఫిబ్రవరి నెలాఖరునాటికి గుంతల రహిత రోడ్లుగా మారుస్తామని తెలిపారు. ఎపిలో పిపిపి మోడ్‌లో రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఫైబర్ నెట్ ద్వారా విస్తృత సేవలు

ఎపిలో ఫైబర్ నెట్ ద్వారా ప్రజలకు మరింత విస్తృత సేవలు అందించేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి సారించాలని మంత్రి జనార్ధనరెడ్డి తెలిపారు. ఫైబర్‌నెట్‌లో క్షేత్రస్థాయిలో పెరుగుతున్న సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల్లో విస్తృతంగా వినియోగించేలా చూడాలన్నారు. గత వైసిపి పాలనలో ఫైబర్‌నెట్‌ను పప్పుబెల్లాల్లా వాడుకున్నారని విమర్శించారు. నేడు సంస్థ దివాళాతీసే పరిస్థితుల్లో ఉందని, సిఎం ఆదేశాల మేరకు గాడిలో పెట్టే పనిచేస్తున్నామని అన్నారు. కోటి కనెక్షన్లు పెంచడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వివరించారు. ప్రైవేటు సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. విద్య, ఉపాధి, ఉద్యోగం, ఆరోగ్యం, వ్యవసాయ, పరిశ్రమల వంటి రంగాల్లో ఫైబర్‌నెట్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గుజరాత్‌లో అందిస్తున్న సేవలపై ప్రభుత్వం అధ్యయనం చేయనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఛైర్మన్ జివి రెడ్డి, ఎన్ యువరాజ్, ఎమ్‌డి కె దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బందరులో పేర్ని నాని భార్య జయసుధ ఓ గోడౌన్ నిర్మించి దానిని పౌర సరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. అందులోని బియ్యం మాయం కావడంపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని నాని పిటిషన్ వేశారు. మాయమైన బియ్యానికి డబ్బు కట్టారని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది కోరారు. నానిని కస్టడీకి తీసుకుని విచారణ చేయాలని, ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని పోలీసుల తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేశారు. అనంతరం హైకోర్టు తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దు

- ముఖ్యమంత్రికి కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దని, దళిత, గిరిజన, బలహీన తరగతుల విద్యార్థులకు ఇబ్బంది కలిగించే జిఓలు 107, 108ని రద్దు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు మెడికల్ కళాశాలల్లో 150 సీట్లు చొప్పున మొత్తం 750 సీట్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చిందన్నారు. 150 సీట్లు ఉన్న మెడికల్ కళాశాలలో ఆల్ ఇండియా కోటా 22 సీట్లు మినహాయిస్తే, 128 సీట్లు హెల్త్ యూనివర్సిటీ తరపున కన్వీనర్ కోటాలో ఏ కేటగిరిలో కేటాయించాల్సి ఉందని తెలిపారు. వీటిలో రిజర్వేషన్‌ల ప్రకారం ఎస్‌సిలకు 19, ఎస్‌టిలకు 8, బిసి(ఎ)కి 9, బిసి (బి)కి 13, బిసి (సి)కి 1, బిసి (డి)కి 9, బిసి (ఇ)కి 5 సీట్లు వరకూ సుమారుగా దక్కాల్సి ఉందని చెప్పారు. జిఓ 107, 108 ప్రకారం కన్వీనర్ కోటాలోని 128 సీట్లలో 64 సీట్లను బి, సి కేటగిరీలుగా మార్చారని, దీనివల్ల ఈ తరగతులు సగం సీట్లను కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఈ జిఓల వల్ల మెరిట్, రిజర్వు కేటగిరి విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. నేషనల్ కమిషన్ ఆఫ్ షెడ్యూల్ ట్రైబ్ (ఎన్‌సిఎస్‌టి) ఈ జిఓలు అమలు విషయంలో పున్ణపరిశీలన చేయాల్సిందిగా కోరారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ కళాశాలలను పిపిపి మోడ్‌లో అభివృద్ధి చేయాలని నిర్ణయించడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ మోడ్ వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రిజర్వేషన్ విధానాలు వర్తించవన్నారు.

లైంగిక వేధింపుల విచారణకు ప్రత్యేక సెషన్ కోర్టులు

- ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ : డిజిపి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

డిజిపి ద్వారకా తిరుమలరావు

మహిళలు, వృద్ధులు, చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నేరస్థులకు వెంటనే శిక్ష పడేలా ప్రత్యేక సెషన్ కోర్టులు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నట్లు డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఎస్‌పి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఒక సైబర్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనుభవంగల సైబర్ నిపుణులు ఈ పోలీస్‌స్టేషన్‌లో నియమిస్తామని, దీనివల్ల పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అవగాహన ద్వారా మాత్రమే సైబర్ నేరాలు అరికట్టగాలమని చెప్పారు. డిజిటల్ అరెస్టు అనేది చట్ట ప్రకారం లేదని స్పష్టం చేశారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈగల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేశామన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో మంగళవారం 39 వేల కేజీల గంజాయిని నిర్వీర్యం చేశామని తెలిపారు. ప్రతి నేరం రికార్డు అయ్యేందుకు సిసి కెమెరాలు చాలా ఉపయోగపడతాయని, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన స్పాట్లలో ప్రజలు, దాతల సహకారంతో రెండు లక్షల కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల ఏరివేతతో ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో తలదాచుకునేందుకు వచ్చే అవకాశం లేదని, రాష్ట్ర పోలీసు శాఖ అంత అసమర్థంగా ఏమీ లేదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. సమావేశంలో డిఐజి గోపినాథ్ జెట్టి, ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్‌పిలు పి.శ్రీనివాసరావు, కె.వి రమణ, ఆర్‌టిసి విజయనగరం జోన్ ఇడి ఎ.విజయకుమార్, విశాఖ డిపిటిఒ బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు మంగళవారం లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 ఏళ్లుగా 2,400 మంది ఆరోగ్యమిత్ర (వైద్యమిత్ర)లు నెలకు రూ.15 వేలు వేతనంతో పనిచేస్తున్నారని తెలిపారు. పట్టభద్రులు, పోస్టు గ్రాడ్యుయేట్లు, డిఇడి అసిస్టెంట్ కేడర్లతో సమానమైన పనులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అయినా అవుట్‌సోర్సింగ్‌లో క్లాస్-4 ఉద్యోగులకు చెల్లించే వేతనాలను మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. దీనిపై ఆరోగ్యమిత్రల సంఘాలతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధికారులు చర్చించి పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. నేటికీ సమస్యలు పరిష్కరించబడలేదని వివరించారు. వారి సమస్యలను పరిగణనలోకి తీసుకుని వైద్యమిత్రలను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చుచేసి, చేస్తున్న పనిని బట్టి కేటగిరి-1గా మార్చి వేతనాలు పెంచాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలని, వైద్యమిత్రలను కొనసాగించి, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

సూపర్ సిక్స్'కు శుభం కార్డు

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలకు ఇక శుభం కార్డు పడినట్లేనని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. సిఎం చంద్రబాబు తీరు చూస్తే మోకాలికి, బోడిగుండుకు ముడి పెట్టినట్లుందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నీతి అయోగ్ నివేదిక ముందు పెట్టి, డబ్బులుంటేనే పథకాలు అమలు సాధ్యమని నీతి సూక్తులను చెప్పిన చంద్రబాబు... ప్రజలను ఘోరంగా మోసం చేశారన్నారు. 50 లక్షల మంది అన్నదాతలను వంచించారని, 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారని, కోటిన్నర మంది మహిళలను మోసం చేశారని పేర్కొన్నారు. మరో 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారన్నారు. ఆర్థిక వేసులుబాటు లేదని వైసిపి ప్రభుత్వమే ఇందుకు కారణమని చెబుతున్న చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో గాడిన పెడతామని ఎన్నికల్లో ఎలా చెప్పారని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, కొత్త అప్పులు పుట్టడం లేదని సాకులు వెతకడం మాని, పథకాల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక అరాచకాలపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని కోరారు. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్లిందో తేల్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర దీన పరిస్థితిని ప్రజలకు వివరించడం మాని, ప్రధాని మోడీకి వివరించి పథకాలకు కావాల్సిన నిధులు అడగాలన్నారు. నిధులు ఇవ్వకపోతే వెంటనే బిజెపికి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సంఘటన స్థలాన్ని పరిశీలస్తున్న నంద్యాల రూరల్ తహశీల్దార్ సత్య శ్రీనివాసులు ((ఇన్‌సెట్‌లో)శిథిలాల కింద చిక్కుకొని మృతి చెందిన బాలుడు)

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి

- కూలిన రెండు ఇళ్ల పై కప్పులు
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నంద్యాల రూరల్ తహశీల్దార్ సత్య శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చాపిరేవుల గ్రామంలోని భీమవరం సుబ్బరాయుడు ఇంటిలో రాత్రంతా గ్యాస్‌లీక్ అయ్యింది. ఇల్లంతా గ్యాస్‌తో నిండిపోయింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కుటుంబ సభ్యులు నిద్ర నుండి లేచారు. పనులు చేసుకోవడానికి లైట్ వేయగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో సుబ్బరాయుడు ఇంటితో పాటు పక్కనే ఉన్న భీమవరం లింగమయ్య ఇంటి పైకప్పులు కూలిపోయాయి. ఈ ఘటనలో భీమవరం వెంకటమ్మ (62), భీమవరం దినేష్ కుమార్ (9)లపై రాళ్లు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలిసిన ఫైర్ స్టేషన్ సిబ్బంది గ్రామానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మృతదేహాలు బయటకు తీశారు. ఎనిమిది మందికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారు నంద్యాల జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎన్ఎంసి మార్గదర్శకాల ప్రకారమే శాశ్వత రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విదేశీ వైద్య పట్టభద్రుల (ఎఫ్ఎంజి) శాశ్వత రిజిస్ట్రేషన్లకు సంబంధిత రాయబార కార్యాలయాలు పూర్తి చేసిన డిగ్రీలను ధ్రువీకరించాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి (ఎపిఎంసి) రిజిస్ట్రార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) మార్గదర్శకాలను పాటించిన, అర్హత కలిగిన ఎఫ్ఎంజిలకు ఎపిఎంసి శాశ్వత రిజిస్ట్రేషన్లను జారీ చేస్తోందన్నారు. మార్గదర్శకాల అమలుపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం ఎపిఎంసికి లేదని తెలిపారు. కోవిడ్-19, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా తమ ఎంబిబిఎస్ కోర్సులో కొంత భాగాన్ని ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన విదేశీ వైద్య విద్యార్థులు రాష్ట్రంలో ఒక ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన అనంతరం శాశ్వత రిజిస్ట్రేషన్ మంజూరు చేయాలని కోరుతున్నారని తెలిపారు. జాతీయ వైద్య కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం చివరి ఏడాది ఆన్‌లైన్‌లో వైద్య విద్యనభ్యశించిన విద్యార్థులు రెండేళ్ల ఇంటర్ షిప్, చివరి రెండేళ్లు ఆన్‌లైన్‌లో విద్యను అభ్యశించిన విద్యార్థులు మూడేళ్ల ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందుకు నిరాకరిస్తూ కొందరు విదేశీ వైద్య విద్యార్థులు వారు విద్యనభ్యశించి విశ్వవిద్యాలయాల నుంచి పొందిన కాంపెన్సేటరీ లేఖలను అంగీకరించాలని కోరారన్నారు. ఆన్‌లైన్ అధ్యయనాలకు తగిన కాంపెన్సేటరీ ఆఫ్ లైన్ విద్యా కాలాన్ని ధ్రువీకరించడానికి అవసరమైన వివరాలు లేఖలో పేర్కొనలేదన్నారు. దీంతో వీరికి శాశ్వత రిజిస్ట్రేషన్ మంజూరు చేయడం సాధ్యం కాలేదన్నారు.

16 ఏళ్లకే బందూకు చేతపట్టి .. దొరలపై ఎక్కు పెట్టి..

జననం : 1931 - మరణం : 19-03-2022

ఆమె బందూకం ఎక్కుపెడితే నిరంకుశ నిజాం సామ్రాజ్యం గడగడలాడేది
ఆమె మాట వినబడితే దొరల గడీ గజగజవణికిపోయేది
ఆమె అండగా నిలబడితే శ్రామిక దండు ఆనందంతో పులకించిపోయేది
ఆమె మాట రజాకార్ల దుర్మదాంధతపై ఎక్కుపెట్టిన తూటా
ఆమె బాట సమానత్వం కోసం ఎత్తిన ఎర్రబావుటా
ఆమె తొమ్మిది దశాబ్దాల జీవితం... ఏడు దశాబ్దాల పోరాటం
అయిదు తరాల అనుభవం ప్రజా పోరాటాలకు అంకితం.
అసువులుబాసే ఆఖరి క్షణంలోనూ పోరు పిడికిలెత్తి విప్లవ చిహ్నం చూపిన వీరవనిత.
ఆమే సాయుధ తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం.

1931లో నల్గొండజిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెం అనే చిన్న గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో పుట్టారామె. తల్లి దండ్రులు చుక్కమ్మ, రామిరెడ్డి. వారు వందల ఎకరాల భూస్వాములు. పదకొండేళ్ళ వయసులోనే స్వరాజ్యం అన్న భీమిరెడ్డి నర్సింహారెడ్డి ప్రేరణతో ప్రజా ఉద్యమంలోకి అడుగుపెట్టారు. జీవితం అంతా ప్రజల కోసం ప్రజలమధ్యే గడిపిన ధన్యజీవి. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలుగా, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలిగా, శాసనసభ్యురాలిగా పలు బాధ్యతలు నిర్వహించిన నిరాడంబరమైన జీవితం గడిపారు. స్త్రీ స్వేచ్ఛ కోసం అహరహం శ్రమించారు. దొరల దోపిడీపై తుపాకీ ఎక్కుపెట్టారు. ఆమెలో ఒక కళాకారిణి, మహిళా హక్కుల కార్యకర్త, మాతృమూర్తి, అన్నిటికీ మించి గొప్ప విప్లవకారిణి మనకు కనిపిస్తారు. ఫ్యూడల్ దొరల పెత్తనం కింద నలిగిపోతున్న వ్యవసాయ కార్మిక మహిళల స్థితిగతులను చూసి ఆమె చలించిపోయారు. దొరల దాష్టీకాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులను సమీకరించి సమ్మె చేయించారు. 'బాంచెనే దొర నీ కాల్మొక్త' అన్న వారి చేతే బందూకులు పట్టించి రజాకార్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. నాడు తెలంగాణలో దొరల ఆగడాలకు అడ్డు అదుపు ఉండేది కాదు. బాలింతలైనా రోజూ పనికి వెళ్లి దొరల పొలాల్లో పని చేయాల్సిందే.

"పాలు చేపుకు వచ్చినయి దొరా... ఇంటి దగ్గర చంటి బిడ్డకు పాలిచ్చి వస్త"అని అన్నా వదలకుండా "ఏదీ చూపించు అని చనులను పిండించి పైశాచికానందం పొందేవారు. దొరల పొలాల్లో పని పూర్తయ్యాకే ఎవరైనా తమ సొంత పొలాల్లో పనులు ప్రారంభించాలి. దొరల ఇంటి ముందు కల్లాపి చల్లి ముగ్గులు వేసిన తరువాతే తమ ఇంటి ముందు కల్లాపి చల్లుకోవాలి. దొరల ఇంట్లో ఏ కార్యం జరిగినా ఊళ్లో వారంతా తమ ఇళ్లల్లో ఉన్న గొర్రెలు, మేకలు, కోళ్ళు సమస్తం సమర్పించుకోవాలి. ఆడ పిల్లలపై దొర కన్ను పడితే ఇక అంతే సంగతి. దొరల ఈ దుర్మార్గాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దళితులతో సహా షెడ్యూల్డ వర్గాలను సమీకరించి పోరాడారు. ఆమె చదివింది మూడు, నాలుగు తరగతులే. అయినా వీర తెలంగాణ విప్లవ పోరాటం అనే విశ్వ విద్యాలయం ఆమెకు అనేక పాఠాలు నేర్పింది.

"నాగళ్ళ మీదున్న ఉయ్యాలో..
నాయన్నలారా ఉయ్యాలో..
చీమురు నెత్తురు లేద ఉయ్యాల్లో..
తిరగబడరేమయ్య ఉయ్యాలో..

అంటూ మెదడు మొద్దుబారిన, అచేతనంగా ఉన్న అణగారిన పేదల్లో పౌరుషాగ్ని రగిలించిన విప్లవ నారి.

యుక్త వయసులో సాయుధ తెలంగాణా రైతాంగ పోరాటంలోకి దుమికిన ఆమె ఆ తర్వాత ఎన్నడూ వెనుదిరిగి చూడలేదు. పోరాట కాలంలోనూ, విరమణ తర్వాత కూడా ఏడు సంవత్సరాలపాటు ఆమె పూర్తిగా జనం మధ్య తిరుగుతూ వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు.

ఆయుధ శిక్షణలో మల్లు స్వరాజ్యం

సాయుధ పోరాట కాలంలో దళ నాయకురాలిగా రాటుదేలిన ఆమె శాసన సభ్యురాలిగా ఉన్నప్పుడూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలోనూ అదే స్ఫూర్తిని కనబరిచేవారు. మాటంటే మాటే. మీన మేషాలు లెక్కించడం, నాన్చుడు ధోరణి ఆమె డిక్షనరీలో లేని పదాలు. ఒకసారి అప్పు తీర్చి చెల్లించలేదని బ్యాంకువారు రైతు ఇంటిపైబడి ఎడ్లను, ఎడ్లబండిని జప్తు చేశారు. ఆ రైతు వచ్చి ఎమ్మెల్యేగా ఉన్న స్వరాజ్యం వద్ద గోడు వెళ్లబోసుకున్నాడు. ఆమె రైతును తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఘర్షణ పడ్డారు. పోలీస్ డిపార్టుమెంట్ వినదు కదా. 'చట్టం తన పని తాను చేస్తుంది' అని ముక్తాయించింది. అలా అయితే ప్రజా నాయకురాలిగా నా పని నేను చేస్తా. మీరేం చేసుకుంటారో చేసుకోండి అని ఎడ్లను, ఎడ్లబండిని తీసుకుని ఇంటికి రైతుకు అప్పగించింది. ఇటువంటి అనుభవాలు, క్లిష్టమైన సమస్యలనెన్నింటినో ఆమె చిటికెలో పరిష్కరించారు.

1992–93 మధ్య కాలంలో సారా వ్యతిరేక ఉద్యమానికి నాంది నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన సారా వేల పాట. దానికి వ్యతిరేకంగా వేలాది మందితో ప్రదర్శన జరిగింది. మహిళలు ట్రాక్టర్లు నడుపుకుంటూ వచ్చారు. ఆ బహిరంగ సభలో మల్లు స్వరాజ్యం ఇచ్చిన పిలుపు మహిళల్లో చైతన్యాన్ని రగిల్చింది. ప్రభుత్వానికి ఇది గట్టి హెచ్చరిక. 'నా గొంతె నాకు తుపాకీ తూటా'అని అంటారామె. అందుకు తగినట్టే తెలంగాణ యాసలో ఆమె బహిరంగ సభల్లో చేసే ప్రసంగాలు తూటాల్లా పేలేవి. 1922 మార్చి 19న ఆమె భౌతికంగా మనల్ని వీడి వెళ్లినా ఆమె జీవితం మనకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

నెల్లూరు నగరవాసులను ఆకర్షిస్తోన్న భారీ ఆర్చ్

ఎర్రకోట నమూనాలో రూపొందించిన ప్రవేశద్వారాన్ని పరిశీలిస్తున్న నేతలు

సిపిఎం మహాసభ జయప్రదానికై
జోరుగా ప్రచారం

- ఊరూ, వాడా విస్తృత ప్రచారం
- ప్లెక్సీలు, ఆర్చ్‌లు, తోరణాలతో ఎరుపు మయం
- నెల్లూరు నగరంలో సాంస్కృతికోత్సవాల కోలాహలం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రజా ఉద్యమాల కిల్లా నెల్లూరు జిల్లాలో సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ సందడి నెలకొంది. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలోని సీతారాం ఏచూరి (అనిల్ గార్డెన్) నగర్‌లో జరగనున్న మహాసభ విజయవంతానికి ఊరూ, వాడా విస్తృత ప్రచారం చేస్తున్నారు. నెల్లూరు నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా ప్రధాన ప్రచారాలు, వాహనాలకు స్టిక్కర్లు, వాల్‌పోస్టర్లు, ప్రచార జాతాలు, పాటల సిడిలు, ఆర్చీలు, ప్లెక్సీలు, హోర్డింగ్‌లతో సందడి వాతావరణం నెలకొంది. మహాసభ ఏర్పాట్లలో సిపిఎం శ్రేణులు పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. మంగళవారం నుంచి నెల్లూరు నగరంతోపాటు జిల్లాలో అలంకరణలు చేస్తున్నారు. ప్రజా నాట్యమండలి కళాకారుల సాంస్కృతిక ఉత్సవాలు నూతనోత్సాహం నింపుతున్నాయి. జిల్లాలో ఎటు చూసినా మహాసభ వాతావరణం కనిపిస్తోంది..

దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య సొంత గడ్డ సింహపురిలో, సిపిఎం నిర్మాత జక్కా వెంకయ్య పోరాటం నడిపిన నెల్లూరు జిల్లాలో 47 సంవత్సరాల తర్వాత మళ్లీ నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభ విజయవంతానికి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహం, ఉత్తేజంతో కదులుతున్నారు. మహాసభ సమయం దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆహ్వాన సంఘం అప్పగించిన బాధ్యతలను నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి జిల్లాకు రానున్న ప్రతినిధులకు స్వాగతం నుంచి వసతి, భోజన ఏర్పాట్లను ఘనంగా చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, పల్లెలు, ఊరు..వాడల్లో సిపిఎం మహాసభ ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఫిబ్రవరి 3న జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లు అతికిస్తున్నారు. జిల్లా అంతటా గోడ రాతలు, వాహనాలకు స్టిక్కర్లు, జాతాలు, మైక్ ప్రచారం వంటి వాటి ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలు సమస్యలపై జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులతో సదస్సులు నిర్వహించారు. వ్యవసాయ కార్మికులు, ట్రాన్స్‌పోర్టు కార్మికులు, మహిళల సమస్యలు, రాజ్యాంగ పరిరక్షణ, కార్మికవర్గ కర్తవ్యాలపై సదస్సులు నిర్వహించారు. సిపిఎం కార్యాలయానికి రంగులు పూర్తి చేశారు. నగరంలో కనకమహల్ సెంటర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద సుందరీకరణ పనులు చేపట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, వి.వెంకటేశ్వర్లు మహాసభ ఏర్పాట్లను పలుమార్లు పరిశీలించారు. ఆయా డివిజన్ల, శాఖల గ్రూపు సమావేశాలు ఏర్పాటు చేసి, మహాసభ విశిష్టత, ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతం, జనసమీకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. ఫిబ్రవరి 3వ తేదీ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి నిర్వహించనున్న ప్రదర్శన, బహిరంగ సభను పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సిపిఎం రాష్ట్ర మహాసభ నేపథ్యంలో మూడు రోజులపాటు జరిగే సాంస్కృతికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

3న భారీ ప్రదర్శన, బహిరంగ సభ

నెల్లూరు నగరంలో 47 సంవత్సరాల తర్వాత మళ్లీ రాష్ట్ర మహాసభ జరుగుతుండడంతో చిరకాలం గుర్తుండేలా నిర్వహించాలని ఆహ్వాన సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మహాసభ చివరి రోజు ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి భారీ ప్రదర్శన జరగనుంది. నెల్లూరు జిల్లా నలమూలల నుంచే కాకుండా ప్రకాశం, చిత్తూరు, కడప, తిరుపతి జిల్లాలతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. ప్రదర్శనలో యల్లాయపాలెం డప్పుల దళం, తిరుపతి, ప్రకాశం జిల్లాల కళాకారుల ప్రదర్శనలు, కోలాటాలు, భజన బృందాలు, విచిత్ర వేషధారణలు ఉంటాయి. 27 మహాసభ సూచికంగా 27 మంది మహిళలు ఎర్ర జెండాలు చేబూని ప్రదర్శనలో పాల్గొననున్నారు. రెడ్ షర్ట్ వలంటీర్ల భారీ కవాతు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నెల్లూరు రూరల్, నగర కమిటీల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు, ట్రైల్ రన్ నిర్వహించారు. విఆర్‌సి మైదానంలో జరిగే బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎంఎ బేబి, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నారు.

యువతకు పుస్తక పఠనం అలవాటు చేయాలి

- మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం
- సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా సింహపురి పుస్తక మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి- నెల్లూరు

పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం

యువతకు పుస్తక పఠనం అలవాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నెల్లూరు నగరంలోని విఆర్‌సి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సింహపురి పుస్తక మహోత్సవాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ వంద ప్రచురణ సంస్థలకు చెందిన పుస్తకాలను ఈ పుస్తక మహోత్సవంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పుస్తక మహోత్సవం ఫిబ్రవరి 3వ తేదీ వరకు కొనసాగనుందన్నారు. అతి త్వరలో ప్రముఖ ప్రచురణకర్తలతో ఘనమైన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాహితీవేత్త పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత సింహపురికి పుస్తక శోభ తీసుకొచ్చిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. సింహపురి ప్రియులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో నగరంలో మరిన్ని పుస్తక మహోత్సవాలకు నాంది పలకాలని కోరారు. పుస్తక ప్రేమికులకు, యువతకు, సాహితీప్రియులకు ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత ఈతకోట సుబ్బారావు, కార్మిక నాయకులు, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు భోగేశ్వరరావు, కవి అవ్వారు శ్రీధర్‌బాబు, పాతూరు అన్నపూర్ణ, సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు దిక్సూచి ఎర్రజెండా

- సాంస్కృతికోత్సవ సభలో రమాదేవి, విఠపు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

సాంస్కృతికోత్సవాల్లో మాట్లాడుతోన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. రమాదేవి, పక్కన విఠపు బాలసుబ్రమణ్యం

భవిష్యత్తులో ప్రజలకు దిక్సూచి ఎర్రజెండానే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. రమాదేవి, మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం అన్నారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరులోని ముత్తుకూరు గేట్ (రుద్రరాజు సత్యనారాయణ) నగర్‌లో జరుగుతోన్న సింహపురి సాంస్కృతికోత్సవాల రెండో రోజు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ.. దక్షిణ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత సుందరయ్య సొంత గడ్డ మీద చారిత్రాత్మకమైన మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. సుందరయ్య కలలు పండాలని కళాకారులు కోరుకుంటున్నారని తెలిపారు. కష్టాలు, బాధలు, ఆకలి లేని సమాజంలో ప్రజలందరూ సుఖంగా జీవించే సోషలిస్టు సమాజం కావాలని సుందరయ్య కలలు కన్నారన్నారు. అందుకోసం యువత పోరాడాలని తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రారంభించాలని తెలిపారు. మనదేశంలో భూస్వామ్యం అంతరించాలని కోరుకున్నారని గుర్తు చేశారు. ఆయన వారసులుగా వందల, వేల మంది కార్యకర్తలు, నాయకులను తయారుచేశారని వివరించారు. ప్రపంచ బ్యాంకు విధానాలకు మద్దతు ఇచ్చే నాయకులు నేడు పరిపాలిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... 47 సంవత్సరాల క్రితం నెల్లూరులో జరిగిన మహాసభను చూసే అవకాశం కలిగిందని, మళ్లీ ఇప్పుడు ఇక్కడ సభ జరుగుతున్నాయన్నారు. గొప్ప వారసత్వం ఉన్నవారు కమ్యూనిస్టులని చెప్పారు. ఎప్పుడో 13వ శతాబ్దంలో మతసామరస్యం కోసం తిక్కన్న ఆ రోజుల్లో పోరాటం చేశారన్నారు. బాబ్రీ మసీదు ధ్వంసం చేసిన తరువాత మతసామరస్యానికి విఘాతం కలిగినప్పుడు జక్కా వెంకయ్య ఉదయగిరి నుంచి నెల్లూరు వరకు మత సామరస్యం కోసం ఎర్రజెండా పట్టుకొని పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. తిక్కనకు నిజమైన వారసులం సిపిఎం నాయకులేనన్నారు. ఎప్పుడో స్వాతంత్ర్య పోరాటంలో కల్లు, సారా వద్దని గాంధీ పోరాటం చేశారని, ఆ తరువాత జరిగిన సారా వ్యతిరేక ఉద్యమం 1990–91లో సిపిఎం నాయకత్వం వహించిందన్నారు. రాబోయే కాలంలో అనేక ఇబ్బందులు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు దిక్సూచిలా ఉండేది ఎర్రజెండానే అని, అందులో సిపిఎం మాత్రమేనన్నారు. సుందరయ్య వారసులమని నిజాయతీగా, బాధ్యతగా ప్రతిజ్ఞ చేయడం కోసం, ప్రజల పక్షాన నిలబడడానికి మహాసభ ఇక్కడ జరుగుతున్నాయన్నారు. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె రెహనా బేగం , ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఎం. పుల్లయ్య, గండవరపు శేషయ్య తదితరులు హాజరయ్యారు. కళారూపాలు ప్రదర్శించిన కళాకారులకు రమాదేవి, విబిఎస్ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వివిధ కళారూపాలు ప్రదర్శించారు.

ఉత్తరాంధ్రకు రూ.50 వేల కోట్లు ఇవ్వాలి

- కేంద్ర ఆర్థిక మంత్రికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వెనుకబడిన ఉత్తరాంధ్రకు రూ.50 వేల కోట్ల నిధులిచ్చి, పెండింగ్ నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 1న 2025–26 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన లేఖ రాశారు. ఆ వివరాలను మంగళవారం మీడియాకు అజశర్మ విడుదల చేశారు. పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 46(3) ప్రకారం వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధి చేయాలన్నారు. కానీ ఈ పదేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులు ఒక్కో జిల్లాకు నామమాత్రంగా కేవలం రూ.100 కోట్లు మాత్రమేనని, ఈ కాలంలో ఏ అభివృద్ధి జరగలేదని ఈ లేఖలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర నీటి ప్రాజెక్టుల సత్వర నిర్మాణానికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని కోరారు. సెక్షన్ 93, షెడ్యూల్ 13 ప్రకారం విశాఖ రైల్వే డివిజన్‌తో కూడిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఆఫీసుల నిర్మాణం పూర్తయ్యేలోగా వెంటనే తాత్కాలిక భవనాల నుండి పాలన ప్రారంభించాలని, సెక్షన్ 93 ప్రకారం గిరిజన, పెట్రో యూనివర్సిటీలకు పూర్తి స్థాయి నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఐఐఎం(వి)లో శాశ్వత అధ్యాపక సిబ్బందిని నియమించాలని, చట్ట ప్రకారం విశాఖ, విజయవాడ మెట్రో రైల్ నిర్మాణాలను ప్రారంభించాలని, రాజధాని నిర్మాణానికి అప్పు కాకుండా చట్టం ప్రకారం గ్రాంటుల రూపంలో నిధులు ఇవ్వాలని కోరారు. సెక్షన్ 90 ప్రకారం పోలవరం నిర్వాసితుల పునరావాస ప్యాకేజీకి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. పై అంశాలను బడ్జెట్‌లో పొందుపరిచి చట్టాన్ని అమలు చేయాలని కోరారు. లేఖ కాపీలను భారత ప్రధానమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి పంపినట్టు అజశర్మ తెలిపారు.

ఎబివి సస్పెన్షన్ కాలం క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిటైర్డు ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు సస్పెన్షన్ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలమైన 2020 ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 2022 ఫిబ్రవరి 7వ తేదీ వరకూ, రెండో విడత 2022 జూన్ 28వ తేదీ నుంచి 2024 మే 30వ తేదీ వరకూ విధులు నిర్వహించినట్లుగా భావించి క్రమబద్ధీకరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐపిఎస్ సర్వీసు రూల్స్ ప్రకారం విధులు నిర్వహించిన కాలంలో చెల్లించాల్సిన అంత మొత్తం చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎబి వెంకటేశ్వరరావుపై వైసిపి ప్రభుత్వం అధికార దుర్వినియోగం, అవినీతి వంటి అంశాలపై కేసులు నమోదు చేయగా, కూటమి ప్రభుత్వం ఈ కేసులను కొద్ది నెలల కిందట ఉపసంహరించుకున్న విషయం విధితమే.

ఐదేళ్లలో రెట్టింపైన క్రెడిట్ కార్డులు : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : గడిచిన ఐదేళ్లలో క్రెడిట్ కార్డుల జారీ రెట్టింపు అయ్యిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. డిసెంబర్ 2019లో 5 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డులు ప్రస్తుతం 10.80 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. ఇదే సమయంలో డెబిట్ కార్డుల జారీలో మాత్రం పెద్దగా పెరుగుదల లేకపోవడం విశేషం. 2019 డిసెంబర్ నాటికి 80.53 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డులు.. ప్రస్తుతం 99.08 కోట్లకు చేరాయి. ఆర్‌బిఐ రిపోర్ట్ ప్రకారం.. 2024లో 447.23 కోట్ల కార్డు చెల్లింపుల లావాదేవీలు జరిగాయి. కార్డు చెల్లింపుల్లో డెబిట్ కార్డులతో పోల్చితే క్రెడిట్ కార్డుల చెల్లింపులే 15 శాతం అదనంగా ఉండటం విశేషం. 2024 డిసెంబర్ ముగింపు నాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు 2.57 కోట్ల క్రెడిట్ కార్డులను జారీ చేశాయి. ఐదేళ్ల క్రితం నాటి 1.22 కోట్ల కార్డులతో పోల్చితే 110 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ప్రయివేటు రంగ బ్యాంక్‌లు 7.66 కోట్ల క్రెడిట్ కార్డులతో 71 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. అధిక ఫీజుల వల్ల విదేశీ బ్యాంక్‌ల కార్డుల జారీ 65.79 లక్షల నుంచి 45.94 లక్షలకు పడిపోవడం ద్వారా వాటి మార్కెట్ వాటా కూడా 11.9 శాతం నుంచి 4.3 శాతానికి పరిమితమయ్యాయి.

పేటియం సిఇఒ నకుల్ జైన్ రాజీనామా

బెంగళూరు : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) నకుల్ జైన్ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. ఆయన స్థానంలో కొత్త చీఫ్‌ను నియమించేందుకు తగు వ్యక్తి కోసం అన్వేషిస్తున్నామని పేర్కొంది. త్వరలోనే కొత్త పేరును ప్రకటిస్తామని వెల్లడించింది. నకుల్ సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, VISAKHAPATNAM
e-Procurement Short Tender Notice
Nit No. SE/AE-2/APEWIDC/38 to 49/2024, Date 27-01-2025
Tenders are invited for Civil Works (12 Nos) i.e. ZPHS at Gara, Seethagunta Gajapathinagaram, Nakkapalli, Anandapuram, Kotananduru, Papinenipalli, Repairs to SW Hostel at Amalapuram, Chimakuirthi, C/o. Model School Building at Mundlapmuru and (1 work) providing Central AC to Finance Bldg at Srikakulam with Estimate cost ranging from Rs. 43.64 Lakhs to Rs. 200.00 Lakhs
Further details: Contact No.9703336838
EXECUTIVE ENGINEER
APEWIDC, VISAKHAPATNAM

క్రెడ్‌లో రూపీ డిజిటల్ కరెన్సీ

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ క్రెడ్‌లో ఇ–రూపీ వాలెట్‌ను అందిస్తోన్నట్లు ఆసంస్థ తెలిపింది. ఇందు కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్టులో భాగం అయినట్లు తెలిపింది. యెస్ బ్యాంక్‌తో కలిసి ఇ– రూపీ వాలెట్ బీటా వెర్షన్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. దీంతో ఇ–రూపీ వాలెట్ అందిస్తున్న తొలి ఫిన్‌టెక్ సంస్థగా నిలువనుంది.

విక్రేతలకు అమెజాన్ అహ్వానం

న్యూఢిల్లీ : విక్రేతలు అమెజాన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ లక్షలాది వినియోగదారులను పొందడానికి తాము ప్రోత్సహాన్ని అందించనున్నట్లు అమెజాన్ ఇండియా పేర్కొంది. ఇందుకోసం 'దిఖోగే తో బికోగే' క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. చిన్న వ్యాపారాలకు దాని డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకాలు ఎలా సరళమైనవి, ప్రభావవంతంగా ఉంటాయో అవగాహనను బలోపేతం కల్పించటానికి ఈ ప్రచారం దోహదం చేయనుందని పేర్కొంది. అంతర్జాతీయంగా 18 దేశాల్లో అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపింది.

Bank of India
Relationship beyond banking
విజయవాడ జోనల్ ఆఫీస్
నెం. 31-23-1ఎ, పివిఆర్ కాంప్లెక్స్, 1వ అంతస్తు, బిఎస్ఎన్ఎల్ భవన్ ప్రక్కన, చుట్టుగుంట, విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్,
0866-2467777/2467764
ఆర్కిటెక్ట్‌లు/కన్సల్టెంట్లు/కాంట్రాక్టర్ల ఎంప్యానెల్‌మెంట్ కొరకు
బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోన్ కోసం ఆర్కిటెక్ట్ కన్సల్టెంట్స్ లేదా కాంట్రాక్టర్ల ఎన్‌ప్యానెల్‌మెంట్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో సొంతంగా స్థాపించబడిన కార్యాలయంతోపాటు తగిన సాంకేతిక సౌకర్యాలు ఉన్న సంస్థ నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ వివరణాత్మక నోటిఫికేషన్ జారీ చేస్తున్నాము. మా బ్యాంకు వెబ్‌సైట్ www.bankofindia.co.in నందు అందుబాటులో కలదు. సీల్డ్ టెండర్లు/దరఖాస్తు స్వీకరణకు చివరి తేది 12.02.2025న సాయంత్రం 4.00 గంటల వరకు. ఈ విషయంలో ఏవైన సవరణలు ఉంటే బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడతాయి.
తేది: 28.01.2025, ప్రదేశం: విజయవాడ — సం/- జోనల్ మేనేజర్, విజయవాడ జోన్

ఆర్‌టిసి ద్వారా మెరుగైన సేవలు

- ఎపిఎస్ ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్‌టిసి ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎపిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారక తిరుమలరావు అన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విజయనగరం వచ్చిన ఆయన స్థానిక డిపిటిఒ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గ్యారేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన వి రాజు, ఎల్ శివాజీ, వై ముత్యాలకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతి, మిగతా విభాగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి, ఎస్‌పి రకుల్ జిందాల్, ఆర్‌టిసి ఇడి విజయకుమార్, ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, డిఎం జై శ్రీనివాసరావు, సిఐ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. సచివాలయంలో మంత్రిని ఎంజెపి గురుకుల పాఠశాలల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులను సన్నద్ధం చేయాలని, అన్ని సబ్జెక్టులనూ రివిజన్ చేయించాలని సూచించారు. పరీక్షల పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేయకుండా, తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సంపాదకీయం

ట్రంప్ వికృత పోకడలు

అందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెదొక దారి అన్నట్టుగా ఉంది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీరు. రెండవ సారి అధ్యక్ష పీఠాన్నధిష్టించిన ట్రంప్ మొదటి వారం రోజుల్లోనే పచ్చిగా తన మితవాద అజెండాను ముందుకు తెచ్చారు. అందులో ముఖ్యమైనది వలసదారులను దేశం నుంచి అవమానకరమైన రీతిలో పంపించేయడం. ఇంతకాలం అమెరికా ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు కల్పించడంలో కీలకంగా వ్యవహరించిన వలసదారులను వెలివేయాలని చూడడం తెలివితక్కువతనం అనుకోవాలా? మూర్ఖత్వం అనుకోవాలా? అతి తక్కువ జీతాలతో రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేసిన వలసదారులను దేశం పైకి దండెత్తిన ఆక్రమణ దారులుగా చిత్రించడం ట్రంప్‌కే చెల్లింది. బ్రెజిల్‌కు చెందిన 88 మంది వలసదారులను చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేసి పంపిన తీరుపై ప్రపంచవ్యాపితంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాత్‌రూమ్‌కు సైతం వెళ్లే పరిస్థితి లేకుండా... మంచినీళ్లు సైతం ఇవ్వకుండా... ఎసి నిలిపివేసి వలసదారులను ఉగ్రవాదులు, నేరస్తుల్లా ట్రీట్ చేయడం అత్యంత గర్హనీయం.

రెడ్ ఇండియన్లను తరిమేసి యూరప్ తదితర దేశాలకు చెందిన శ్వేత జాతీయులు అక్కడ పాగా వేశారు. ఆఫ్రికన్ దేశాల నుంచి బానిసలను తీసుకొచ్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకున్న చరిత్ర అమెరికాది. దాదాపు 35 కోట్ల యుఎస్‌ఎ జనాభాలో మూడు కోట్ల మంది వరకూ వలసదారులే. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ తాత ఫ్రెడరిక్ ట్రంప్ కూడా బవేరియా, జర్మనీ మూలాలుండి వలస వచ్చిన వాడే. విద్వేష విషం చిమ్మే మితవాదమే అజెండాగా కలిగిన రిపబ్లికన్ పార్టీ తరపున ఎన్నికైన ట్రంప్... మహా కుబేర సామ్రాజ్యాన్ని సృష్టించేందుకు వలసదారుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారు.. అధికారంలోకి వచ్చిన వెంటనే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వుల పట్ల అమెరికా లోపల, వెలుపల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 1868లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా అమలులోకి వచ్చిన చట్టం ప్రకారం... అమెరికాలో జన్మించిన వారికి జన్మతహ పౌరసత్వం లభిస్తుంది. ఈ చట్టాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమంటూ సియాటెల్, వాషింగ్టన్ కోర్టులు ఇప్పటికే నిలిపివేశాయి. 22 రాష్ట్రాలు, 200కిపైగా కార్మిక సంఘాలు ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కోర్టులను ఆశ్రయించాయి. ట్రంప్ ఆదేశాలు అమలు కావాలంటే... ఇవన్నీ తేలి సుప్రీంకోర్టు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఇదంతా అయ్యేది కాదని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. వలసదారులను తీవ్ర అభద్రతకు గురిచేసి, తద్వారా మరింత కారుచౌకగా వారి శ్రమను కార్పొరేట్ సంస్థలు దోచుకోవడం అంతర్లీనంగా ఉన్న పన్నాగం. అక్కడి కార్మిక, ఉద్యోగ సంఘాలు సైతం ట్రంప్ తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఈ పరిణామాలతో తెలుగు వారు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం 2024 నాటికి ఏడు లక్షల 25 వేల మంది భారతీయులు అమెరికాలో ఉన్నారు. వారిలో 20 వేల మందికి పైగా సరైన పత్రాలు లేకుండా ఉంటున్నారని అంచనా. మైడియర్ ఫ్రెండ్ అంటూ ప్రధాని మోడీ ట్రంప్‌ను అభినందించారు. తాజాగా ఆయనతో ఫోన్‌లో కూడా సంభాషించారు. ఈ సంభాషణలో అమెరికా నుంచి పంపడానికి సిద్ధంగా ఉన్న వేలాది మంది భారతీయ వలసదారులకు సంబంధించిన ఊసే లేదు. పైగా చైనా, భారత్, బ్రెజిల్ తదితర దేశాలు అధికంగా సుంకాలు విధిస్తున్నాయంటూ ట్రంప్ రుసరుసలాడుతున్నాడు. అమెరికాకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న అపర కుబేరులుసహా అమెరికన్లందరిపై విధించే ఆస్తి పన్నును రద్దు చేసి, ఆ లోటును ప్రపంచ దేశాలపై సుంకాలు అధికంగా వసూలు చేయడం ద్వారా భర్తీ చేస్తామని తెంపరి ట్రంప్ బహిరంగంగానే ప్రకటించాడు. మితవాద అజెండా కలిగిన బిజెపి నేతృత్వంలోని మోడీ సర్కారు ట్రంప్ గత పాలనలో అంటకాగినా... ఇండియాకు ఒరిగిందేమీ లేదు. అడపా దడపా భారత్‌పై ఆంక్షల కొరడా ఝుళిపిస్తూనే ఉంది. హెచ్ 1 బి సహా వీసాలను కఠినతరం చేసింది. .అమెరికా ఇండో పసిఫిక్ వ్యూహంలో భాగమైన క్వాడ్ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న భారత్ ఈ ఏడాది చివరిలో సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. అమెరికా ప్రయోజనాలే ఫస్ట్ అని ట్రంప్ ప్రకటించిన తరువాత కూడా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమెరికాతో అంటకాగేందుకే ఇష్టపడుతోంది. ఇది మన దేశ ప్రయోజనాలకు ఎంతమాత్రం మంచిది కాదు. అమెరికా ప్రపంచ పోలీస్ పెత్తనాన్ని సహించేది లేదని మెక్సికో, కెనడా, బ్రెజిల్ ఇప్పటికే స్పష్టం చేశాయి. మదర్ ఆఫ్ డెమొక్రసీ అని లెక్చర్లిచ్చే మోడీ ప్రభుత్వం అమెరికా పట్ల లొంగుబాటు వైఖరిని విడనాడి స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించాలి. వలసదారుల విషయంలో అంతర్జాతీయ చట్టాలు, న్యాయ నియమాలను అమెరికా గౌరవించేలా ఒత్తిడి తీసుకురావాలి.

మహనీయుల మాట



గెలుపు అందరికీ దొరకదు
కానీ...
గెలిచే శక్తి మాత్రం
అందరిలోనూ వుంటుంది.
- సిసిరో

విశ్లేషణ

పెట్టుబడి రహిత పంటల సాగు సాధ్యమేనా?

శ్రీలంక ప్రకృతి వ్యవసాయ ప్రయోగం పరిణామాలు కూడా 2024లో ప్రముఖంగా చర్చకొచ్చాయి. అనేక మంది వ్యవసాయ రంగ నిపుణులు ప్రకృతి వ్యవసాయ సాధ్యాసాధ్యాన్ని, ఆ ఫలితాల ఆధారంగా విశ్లేషించారు. వాటిని క్లుప్తంగా చర్చించిన డా.యం.ఎస్ సిద్ధూ (పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం) తన కీలకమైన, శాస్త్రీయమైన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. దాని ప్రకారం ప్రకృతి వ్యవసాయం... సమగ్ర పోషక, రక్షణ వ్యవసాయం కంటే మిన్న అనేది అవాస్తవం. ముఖ్యంగా అధిక జనాభాగల దేశాల్లో అది వెంటనే సాధ్యపడదు. అంతమాత్రం చేత వ్యవసాయ రసాయనాల్ని విచ్చలవిడిగా వాడే విధానం కేంద్రంగా ఉన్న ప్రస్తుత పంటల సాగు ప్రయోజనమని చెప్పలేము. కాబట్టి భూమిని, పర్యావరణాన్ని రక్షించగల, ప్రజారోగాన్ని కాపాడగల విధానం మనకు కావాలి. దానికి తగిన సంస్కరణల్ని ప్రభుత్వాలు చేపట్టాలి. అప్పుడే కీలక ఉత్పత్తిదారులు, వినియోగదారులు సమంగా రక్షించబడతారు.

ప్రస్తుతం దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం లేక శూన్య పెట్టుబడి (కృత్రిమ రసాయన రహిత లేక పర్యావరణ హిత) వ్యవసాయాల ప్రచారం నడుస్తున్నది. ఈ తరహా వ్యవసాయం రైతుల్ని వ్యవసాయ సంక్షోభం నుండి బయట పడెయ్యటమేకాక రైతు సాధికారతకు, రైతు రక్షణకు దోహద పడుతుందని చెప్పబడుతున్నది. ఇది ఎంత వరకు సాధ్యం? శాస్త్ర విజ్ఞానం ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసి, ప్రగతికి దోహద పడాలని ఆశించే 'జన విజ్ఞాన వేదిక' ఆ అంశం మీద చర్చ నడవాలని ఆశిస్తున్నది.

వ్యవసాయ సంక్షోభం మూలాలెక్కడ?

శ్రమకు తగ్గ ఫలితం, పొందుతున్న ప్రతిఫలానికి తగిన శ్రమ సమాజానికి ఇరుసుగా ఉండాలి! అందరికీ పోషకాహారం, సౌకర్యవంతమైన నిలువ నీడ, విద్య, వైద్య సౌకర్యాలు ఇవ్వగల సమాజం కావాలి! అయితే దానికి సోషలిజమే పరిష్కారమన్న 'మార్క్సిజం'ను అందుకొన్న లెనిన్, స్టాలిన్, మావో, హోచిమిన్, కాస్ట్రోల వరవడిని ఆపేదెలా? ప్రపంచంలో "సోషలిస్టు జాడ్యం తగ్గేదెలా"? వంటి అంశాలతో అమెరికా రూజ్‌వెల్ట్ ప్రవేశ పెట్టిన 'న్యూ డీల్' (అమెరికా మార్క్ సోషలిజం) థియరీ ఫలితమివ్వలేదు. ఆ కూడలిలో ఉద్భవించిన మేధావుల (మాయగాళ్ల) ప్రతిరూపమే "రీగన్-థాచర్-కిసింజర్" స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం. దాని ప్రభావితులైన గోర్బచేవ్-డెంగ్ సియావులు (తాత్వికత) ప్రపంచ వరవడిని మరో వైపుకు తిప్పారు. ఫలితంగా గాంధీలు, నరసింహారావులు, చిదంబరంలు, ముఖర్జీలు, మన్మోహన్లు భారతదేశంలో ఉద్భవించారు. వారి వారసులు మన రాష్ట్ర పాలకులలోనూ వున్నారు. వీరి వల్ల వర్ధమాన దేశాలకు కీలకమైన సంక్షేమ పథకాలు, సామాజక సంస్కరణలు అటకెక్కించబడ్డాయి. 'అభివృద్ధి'కి అర్థం మారిపోయింది. వాణిజ్య వ్యవస్థల దిశ మారింది. ప్రపంచీకరణ రూపాంతరం చెందింది. 'స్వేచ్ఛా వాణిజ్యం' రెక్కలు విప్పిన ఫలితంగా అభివృద్ధి చెందే దేశాల కీలక రంగం - వ్యవసాయం - బలి చేయబడ్డది. దానికి తార్కాణమే భారత వ్యవసాయ ముఖ్య పాత్రధారులైన రైతులు, రైతుకూలీలు ఆత్మహత్యలకు పాల్పడే, నిత్యం వలసలు వెళ్లే స్థితి వచ్చింది. ఆహార భద్రతకు తిలోదకాలిచ్చే మార్పులు వచ్చాయి. ఆయుధాలతో పాటు ఆహారం కూడా దిగుమతి చేసుకోవచ్చనే ధోరణి ప్రబలింది.

ప్రొ॥ ఎన్. వేణుగోపాలరావు

సమాంతరంగా కుటుంబ వ్యవసాయ పతనం బడుగు దేశాలకు నష్టమనే విశ్లేషణను "ప్రపంచ వ్యవసాయ ఆహార సంస్థ" ముందుకు తెచ్చింది. ధరిత్రీ సదస్సుల ద్వారా పర్యావరణ పతనం, ప్రజారోగ్య నిర్లక్ష్యం, బీదరికం తీవ్రతలు చర్చకొచ్చాయి. ధరిత్రీ సదస్సులు, సహస్రాబ్ది లక్ష్యాలను బడుగు దేశాలు ముందుంచాయి. వ్యవసాయాన్ని (ఆహార రంగాన్ని) మార్చాల్సిన అవసరాన్ని హేతుబద్ధంగా ముందుకు తెచ్చాయి. నిరంతర భద్రతల్ని పెంచే లక్ష్యంతో ప్రతి ఏటా 'కాప్' (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) సదస్సులు జరిపి, అభివృద్ధి చెందిన దేశాల బాధ్యతల్ని గుర్తు చేస్తూ వచ్చింది (తాజాగా కాప్ 29 సదస్సు బాకూ నగరం, అజర్‌బైజాన్‌లో జరిగింది). పర్యావరణ సంక్షోభాలు, పరిష్కారాలపై చర్చ జరుగుతూనే ఉంది.

పాలకులు-ప్రకృతి వ్యవసాయం

నూతన శతాబ్ది ప్రారంభంలో మళ్లీ సంక్షేమ పథకాల ద్వారా వ్యవసాయాన్ని ఉద్ధరిస్తామనే పాలకులు (పాత వాళ్లే) రూపాంతరం చెందారు. మానవీయ కోణాన్ని ముందుకు తెచ్చి అభివృద్ధి దిశ మార్చబోతున్నట్లు నమ్మబలికారు. ఆ దశలో ముందుకు తెచ్చినదే భారతదేశ కృత్రిమ రసాయన రహిత వ్యవసాయం లేక ప్రకృతి సేద్యం. దానికి జపాన్ దేశ 'మసానొబు ఫుకువొకా' వంటి వారు దారి చూపారు. రైతు సాధికారత, బీదరికం తొలగింపు వంటి నినాదాలు ఊపందుకున్నాయి. ఆహార భద్రతా చట్టాలు, ఉపాధి హామీ పథకాలు, మానవీయ కోణంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందాయి. ఈ వరవడి ప్రపంచ వాణిజ్య సంస్థకు, విత్తన రంగ సంస్థలకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు సరిపడలా. అందుకే బుష్-రైస్-మోన్‌శాంటో-క్లింటన్-బిల్‌గేట్ల అభివృద్ధి పథకాన్ని ముందుకు తెచ్చారు. మళ్లీ వ్యవసాయ అభివృద్ధి పథకాలు మార్చారు. దాన్నే 'ఇండో-యు.ఎస్ నాలెడ్జ్ ఇనీషియేటివ్ ఆన్ అగ్రికల్చర్' అనమన్నారు.

అమెరికన్ విశ్వవిద్యాలయాల విత్తన ప్రణాళిక భారత దేశానికి అనువైనదనే వైఖరిని చొప్పించింది. అయినా వ్యవసాయ సంక్షోభం ఆగలేదు. పర్యావరణ పతనం, ప్రజారోగ్య క్షీణత పెరుగుతూనే వచ్చింది. రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ అధ్యయనాలు ముందుకొచ్చాయి. సాంద్ర వ్యవసాయం (హరిత విప్లవాన్ని) "చాంద్ర వ్యవసాయంగా" (ఇజ్రాయిల్-కుప్పం పంటల సాగు) మార్చగలిగిన సంస్కరణల వెతుకులాట మొదలయ్యింది. కంపెనీలతో కూడిన సహకార వ్యవసాయం ప్రతిపాదించబడింది. ఆహార ఉత్పత్తిదారుడి కేంద్రంగా వ్యవసాయాన్ని మరల్చాలని, రైతు అజమాయిషీలో ప్రాథమిక వ్యవసాయ వనరు (భూమి, సాగు నీరు) ఉండాలని, ప్రత్యామ్నాయ వ్యవసాయంపై అవగాహన పెంచాలని, ఉత్పత్తుల మార్కెటింగ్ ప్రభుత్వ అజమాయిషీలో ఉండాలని సూచించిన జస్టిస్ చౌదరి, జయతీ ఘోష్, రాధాకృష్ణన్, స్వామినాథన్‌తో కూడిన కమిషన్ చేసిన సిఫార్సులు పాలకులకు నచ్చలేదు. మత-మిత వాదులకు స్వాతంత్ర్య ఫలాలను (అజాదీ కా అమృతాన్ని) పంచేందుకు అనుకూలమైన పరిస్థితిని కల్పించారు.

పాలక వర్గాలు వాస్తవ రైతుల్ని వెనక్కు నెట్టి, కార్పొరేట్లకు లాభాల్ని పెంచగలిగే నూతన వ్యవసాయ చట్టాలు చేశాయి. వ్యవసాయ సంక్షోభాలు తీవ్రతరమైనాయి. రైతు సంఘాల సమాఖ్యలు ఉద్యమాల్ని తీవ్రం చేశాయి. సమాంతరంగా ప్రభుత్వ శాఖలు ఆవు కేంద్ర వ్యవసాయం, శూన్య పెట్టుబడి పంటల సాగు, కంపెనీ సహకార సేద్యం వంటి వాటిని ముందుకు తెచ్చాయి. ఆజాదీ కా అమృతాన్ని పంచుతున్నట్లు రైతుల్ని కూడా ఊరిస్తున్నారు. వ్యవసాయ సంక్షోభం పెరుగుతూనే ఉంది. అయినా పాలకుల తీరు మారడం లేదు. మొన్నటి క్యూబా, నిన్నటి శ్రీలంక దేశాల అనుభవం వారి తలకెక్కడం లేదు. ఇంకా రైతు సాధికార నినాదాలతో వ్యవసాయ రంగ ఉద్ధరణే కీలక లక్ష్యంగా ప్రచారం చేస్తూనే ఉన్నాయి ప్రభుత్వాలు.

జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం

తాజాగా, 2024-25 వార్షిక బడ్జెట్ సమయంలో ప్రకటించిన 'జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం' ద్వారా కోటి మంది రైతుల్ని ప్రకృతి వ్యవసాయంలోకి చేర్చాలనే ప్రయత్నాలు మొదలయ్యాయి. దాన్ని "భారతీయ ప్రాకృతిక కృషి పధాతి:" అనమన్నారు. దీనికోసం రూ.4,646 కోట్లు కేటాయించామని ఆర్థికమంత్రి గొప్పగా పార్లమెంట్‌లో ఉటంకించారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ కృత్రిమ రసాయనాలకు బదులుగా, ఆవు ద్వారా లభించే సేంద్రియ ఎరువులు, అడవి మొక్కల కషాయాలు వాడేలా చూస్తారట. ఈ వ్యవసాయం పలు రకాల పంటల సాగు, పశు పాలన, అడవి చెట్ల పెంపకంలో భాగంగా ఉంటుందట. ఈ సాగు భూసారాన్ని రక్షించటమేగాక, పర్యావరణ, ప్రజారోగ్య రక్షణలకు తోడ్పతుందని చెప్తున్నారు. ఈ ప్రకృతి వ్యవసాయం యొక్క ఫలితాలను అంచనా వేసే నిమిత్తం భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలిలో భాగమైన జాతీయ వ్యవసాయ విజ్ఞాన అకాడమీని నియమించింది. సమాంతరంగా ఆర్థిక సామాజిక అధ్యయన సంస్థ (సెస్)-హైదరాబాద్ కూడా అంచనా వేసింది. అలానే స్వయం సహాయక వ్యవస్థ ఎన్విరాన్‌మెంట్ సపోర్ట్ గ్రూప్ కూడా అధ్యయనాల్ని ప్రకటించింది (వికాస్ వాసుదేవ, 2024 ది హిందు).

శ్రీలంక ప్రకృతి వ్యవసాయ ప్రయోగం పరిణామాలు కూడా 2024లో ప్రముఖంగా చర్చకొచ్చాయి. అనేక మంది వ్యవసాయ రంగ నిపుణులు ప్రకృతి వ్యవసాయ సాధ్యాసాధ్యాన్ని, ఆ ఫలితాల ఆధారంగా విశ్లేషించారు. వాటిని క్లుప్తంగా చర్చించిన డా.యం.ఎస్ సిద్ధూ (పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం) తన కీలకమైన, శాస్త్రీయమైన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. దాని ప్రకారం ప్రకృతి వ్యవసాయం...సమగ్ర పోషక, రక్షణ వ్యవసాయం కంటే మిన్న అనేది అవాస్తవం. ముఖ్యంగా అధిక జనాభాగల దేశాల్లో అది వెంటనే సాధ్యపడదు. అంతమాత్రం చేత వ్యవసాయ రసాయనాల్ని విచ్చలవిడిగా వాడే విధానం కేంద్రంగా ఉన్న ప్రస్తుత పంటల సాగు ప్రయోజనమని చెప్పలేము. కాబట్టి భూమిని, పర్యావరణాన్ని రక్షించగల, ప్రజారోగాన్ని కాపాడగల విధానం మనకు కావాలి. దానికి తగిన సంస్కరణల్ని ప్రభుత్వాలు చేపట్టాలి. అప్పుడే కీలక ఉత్పత్తిదారులు, వినియోగదారులు సమంగా రక్షించబడతారు.

/వ్యాసకర్త వ్యవసాయ శాస్త్రవేత్త, సెల్ : 9490098905 /

వ్యాఖ్య

ఆదివాసీలకు ఉపాధి కల్పించే టూరిజం కావాలి

కిల్లో సురేంద్ర

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో జనవరి 31 నుండి ఫిబ్రవరి 2 వరకు టూరిజం ప్రమోట్ చేసే భాగంగా దేశ, విదేశీ యాత్రికులను ఆకట్టుకునేందుకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో చలి ఉత్సావాలు నిర్వహిస్తున్నది. ఇందుకోసం కోట్ల రూపాయల ఖర్చుకు సిద్ధం అవుతున్నది. ఆదివాసులకు కావాల్సింది చలి ఉత్సవాలు కాదు. జీవో నెం.3కు చట్టబద్ధత కల్పిస్తూ ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి అరకు చలి ఉత్సవాలు నిర్వహించాలి. చలి ఉత్సవాల పేరుతో టూరిస్టులకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే కన్నా చలి కాలంలో పాడేరు ఏజెన్సీలో సున్నా డిగ్రీల చలికి వణుకుతున్న 50 వేల మంది ఆదివాసీ హాస్టల్ విద్యార్థినీ విద్యార్థులకు చలి దుప్పట్లు పంపిణీ చేయాలి.

ఆదివాసీలకు ఉపాధి కల్పించేలా టూరిజాన్ని అభివృద్ధి చెయ్యాల్సిందిపోయి వారి సంస్కృతిని నాశనం చేసే విధంగా టూరిజాన్ని వృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తోంది ప్రభుత్వం. బినామీ పేర్లతో పెద్దపెద్ద లాడ్జీలు, రిసార్ట్స్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి వందలాది ఎకరాల ఆదివాసీల భూములను ధారాదత్తం చేస్తూ 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్నది. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నా...రోజురోజుకు అక్రమ కట్టడాలు పెరుగుతున్నా...ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడంలేదు. సోమవారం నాడు విశాఖలో జరిగిన టూరిజం ఇన్వెస్టర్స్ సదస్సులో పెట్టుబడులను ఆకర్షించేందుకు 1/70 చట్టాన్ని సవరించాలని సాక్షాత్తు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రతిపాదించడం దారుణం. ఈ విషయమై అధికారులు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని కూడా చెప్పారు. అంటే 1/70ని మార్చివేయాలన్నదే వారి నిశ్చితాభిప్రాయంలా వుంది. గిరిజనుల మనుగడకు ప్రమాదకరమైన ఈ ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకించాలి.

ఆదివాసీలకు ఉపాధి కల్పించేలా టూరిజాన్ని అభివృద్ధి చెయ్యాల్సిందిపోయి వారి సంస్కృతిని నాశనం చేసే విధంగా టూరిజాన్ని వృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తోంది ప్రభుత్వం. బినామీ పేర్లతో పెద్దపెద్ద లాడ్జీలు, రిసార్ట్స్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి వందలాది ఎకరాల ఆదివాసీల భూములను ధారాదత్తం చేస్తూ 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్నది. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నా...రోజురోజుకు అక్రమ కట్టడాలు పెరుగుతున్నా...ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడంలేదు.

టూరిజంలో వచ్చే ఆదాయంలో 25 శాతం నిధులను స్థానిక ఆదివాసీ అభివృద్ధికి ఖర్చు పెట్టాలనే నిబంధన ఉంది. అయినప్పటికీ బేఖాతరు చేస్తూ చలి ఉత్సవాల కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టడంపై ఆదివాసీ సమాజం తీవ్ర ఆందోళ చెందుతున్నది. ఏజన్సీ ప్రాంతంలో రోడ్లు, వంతెనలు లేనందున గర్భిణీలు, రోగులను హాస్పిటల్‌కు తరలించేందుకు అంబులెన్సులు రావడంలేదు. డోలీ మోతలతో మార్గ మధ్యలోనే మరణిస్తున్నారు. మరోవైపు సరైన పౌష్టికాహారం లేక రక్తహీనత, సికిల్ సెల్ ఎనీమియా, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులతో పదుల సంఖ్యలో మరణిస్తున్నారు. వారికోసం సరైన సదుపాయాలు కల్పించకపోగా ఆదివాసుల ప్రకృతి అందాలు చూపించి కోట్ల రూపాయల ఆదాయాలు పోగేసుకుంటూ దేశ, విదేశీ టూరిస్టులకు కోట్లు ఖర్చు పెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనతో ఆదివాసీ సమాజం తీవ్ర ఆందోళ చెందుతున్నది. ఆదివాసీ యువతకు వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పించే జీవో నెం 3 రద్దవడంతో గంజాయి సాగు మాయలో పడి జైలు పాలౌతున్నారు. ఏజన్సీలో ఉపాధి అవకాశాలు లేక మైదాన ప్రాంతాలైన విశాఖ, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు వెళ్లి ఇటుక బట్టీల్లో, చేపలు, రొయ్యల చెరువుల్లో పనికి కుదిరి వందలాది మంది మోసపోతున్నారు.

ఆదివాసీల కళలు, సంస్కృతి రక్షణకు ఉత్సవాల నిర్వహణ పట్ల ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించడంలేదు. పైగా వారి సంస్కృతి నాశనమయ్యే విష సంస్కృతిని ప్రమోట్ చెయ్యడంతో భవిష్యత్‌లో ఆదివాసీల హక్కులకు, వారి అస్తిత్వానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది. ఆదివాసీ సమాజం, ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడ్డానికి పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

పాడేరు ఏజెన్సీలో ప్రముఖ పర్యాటక కేంద్రాలైన బొర్రా, ట్రైబల్ మ్యూజియం, పద్మపురం గార్డెన్, చాపరాయి, కొత్తపల్లి జలపాతం నుండి ఏడాదికి సుమారుగా రూ.20 కోట్ల వరకు ఆదాయం వస్తున్నది. టూరిజంలో వస్తున్న ఆదాయంలో 25 శాతం నిధులు స్థానిక ఆదివాసుల అభివృద్ధికి, విద్యా వైద్యం మౌలిక వసతులపై ఖర్చు పెట్టడం లేదు. మరోవైపు టూరిస్టులకు కోట్లు ఖర్చు చెయ్యడం ఆదివాసులకు తీవ్ర అన్యాయం చెయ్యడమే అవుతుంది.

ఆదివాసీల సంస్కృతి, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, చట్టాల పరిరక్షణకు, టూరిజంలో వస్తున్న ఆదాయంలో 25 శాతం స్థానిక ఆదివాసీల అభివృద్ధికి నిధులు కేటాయించడం కోసం, జీవో నెం.3 చట్టబద్ధత కోసం, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ సాధించుకునేందుకోసం ఆదివాసీలు ముందుకు రావాలి.

/ వ్యాసకర్త ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

సమస్య

ఇది జీవో 117 స్కూలు కథ

ఐ. వెంకటేశ్వరరావు

ఏ విధానం తప్పయినా సంఘాలు విమర్శించరాదని, విధానాలతో సంఘాలకు పనేమిటని, మా విద్యా విధానం తప్పయితే ప్రజలు తమ తీర్పుల ద్వారా తేల్చుకుంటారని గత ప్రభుత్వం చెప్పింది. ప్రజలు అలాగే తీర్పు చెప్పారు. ఈ ప్రభుత్వం విద్యా విధానంలో తీసుకు రావాల్సిన మార్పులు ప్రజాస్వామ్యయుతంగా చర్చించి మంచి నిర్ణయాలు తీసుకోవాలి. అంతేగాని ఎవరేం చెప్పినా వినం. అనుకున్నదే చేస్తామంటే విద్యా వ్యవస్థకు, విద్యార్థులకు కష్టం, నష్టం జరుగుతుంది. చివరకు ప్రభుత్వ విద్యావ్యవస్థ ఇంకా బలహీనమవుతుంది.

ఇటీవల తణుకులో బాలోత్సవానికి వెళ్తూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం వెదిరేశ్వరం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలను సందర్శించాం. ప్రస్తుతం ఈ పాఠశాలలో యుటిఎఫ్ కార్యకర్త నిర్మలమ్మ ఏకోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. 2021 సంవత్సరంలో 20 మంది పిల్లలు ఉండేవారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ 117 జీవోతో 3, 4, 5 తరగతుల పిల్లలను...గ్రామస్తుల వేడుకోలుకు వ్యతిరేకంగానే, బలవంతంగానే కాలువ అవతల ఉన్న జడ్పీహెచ్‌ఎస్ వెదిరేశ్వరంలో విలీనం చేశారు. 1, 2 తరగతుల అడ్మిషన్లు లేకపోవడంతో జీరో విద్యార్థుల స్కూల్‌గా మారిపోయింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మండల విద్యాశాఖాధికారులు గ్రామస్తులు, ఉపాధ్యాయుల మొర ఆలకించలేదు. ప్రభుత్వ ఆదేశాల అమలుకే ఆరాటపడ్డారు. విధానపరంగా ప్రభుత్వ ఆదేశాల అమలు తప్ప వారు మాట్లాడే పరిస్థితి లేదు. ఆనాడు కాలువ అవతల, ఇవతల స్కూళ్ళే కాదు రావులపాలెం హైవే జంక్షన్ ఆవల ఊబలంక వైపు ఉన్న స్కూళ్లను కూడా రావులపాలెం ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తే పిడిఎఫ్ బస్ యాత్ర సందర్భంగా గ్రామస్తుల విజ్ఞప్తిని అధికారులకు చెప్పి నిలుపుదల చేయించడం జరిగింది.

నాడు శ్రీకాకుళం నుండి ప్రారంభించిన పిడిఎఫ్ బస్సు యాత్రకు అనుమతి లేదని, సీజ్ చేస్తామని, బ్యానర్ తీసివేయమని పార్వతీపురం చేరుకున్న బస్సు యాత్రను పార్వతీపురంలో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు బెదిరించారు. అయినా యాత్ర కొనసాగించాము. గ్రామస్తుల విజ్ఞాపనలు ఎమ్మెల్సీలకు ఇవ్వనివ్వలేదు. కొన్ని చోట్ల యాత్రను స్కూళ్లకు వెళ్లనివ్వలేదు. అడుగడుగునా పోలీసు నిర్బంధాన్ని అధిగమించి 13 జిల్లాల పర్యటన పూర్తి చేశాం. గ్రామస్తులు కొన్ని చోట్ల ధర్నాలు చేస్తే కేసులు పెడతామని బెదిరించారు. మీడియంతో సంబంధం లేకుండా ఉర్దూ మీడియం స్కూళ్ళను తెలుగు మీడియం స్కూళ్ళలో విలీనం చేశారు. ఆందోళనలతో కొన్ని చోట్ల కొన్ని పాఠశాలల విలీనాన్ని నిలుపుదల చేయించినా ప్రభుత్వం అనుకున్నదే అమలు చేసింది. పాఠశాలల విలీనం పిల్లలకు దూరమైనా, భారమైనా పట్టించుకోలేదు. అయితే అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొందరు నా నియోజకవర్గంలో 117 అమలు చేయరాదని ఆదేశించడంతో కొన్ని చోట్ల మాత్రం ఆగాయి. మొత్తం మీద 117 జీవో ఊరి బడికి ఉరి వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 117 స్కూళ్ళ కథలు ఇలాగే ఉన్నాయి.

పిల్లలకు, తల్లిదండ్రులకు సబ్జెక్టు టీచర్ల బోధనను, ఉపాధ్యాయులకు ప్రమోషన్ల మాట చెప్పి మోసం చేశారు. 117 జీవోతో ఏమి జరిగిందో, ఏమి ఒరిగిందో ఎన్ని వేల పోస్టులు ఎటు వెళ్లిపోయాయో, డిఎస్‌సి పరిస్థితి ఏమైందో ఆనాడు అర్థం కాని వారికి ఐదేళ్ళ తర్వాత అర్థమైంది. చివరికి ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అయిపోయాయి. జీరో పిల్లల పాఠశాలలుగా, ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. నాడు - నేడు లో వేల కోట్లు వెచ్చించి లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన ప్రాథమిక పాఠశాలలు పిల్లలు లేక వెలవెలపోయాయి. ఎలిమెంటరీలో తెలుగు మీడియం ఎత్తేసి, హైస్కూళ్ళలో సమాంతర మీడియాలు రద్దు చేసింది ప్రభుత్వం. ఎయిడెడ్ పాఠశాలలను విలీనం చేసి ఆ పోస్టులనూ రద్దు చేసింది. ఎల్.ఎఫ్.ఎల్ పోస్టులు కన్వర్షన్ చేసి ఐదుగురు ఉపాధ్యాయులు లేకుండా చేసి ఆ పోస్టులను రద్దు చేసింది. హైస్కూళ్లలో మీడియంలను విలీనం చేసి పిల్లల సంఖ్యను పెంచి సెక్షన్లు తగ్గించివేసింది. స్కూళ్ళ అసిస్టెంట్ పోస్టులను కుదించి, చివరకు ఖాళీ పోస్టులే లేవని, మిగులు పోస్టులే మిగిలిపోయాయని ప్రభుత్వం చెప్పింది.

ప్రభుత్వం ఉన్న ఉపాధ్యాయులను అకడమిక్ పని చేయనీకుండా శిక్షణలు, యాప్‌ల భారం మోపడంతో ప్రమాణాలు ఎటు వెళ్లిపోయాయో అసర్ నివేదికలు అసలు గుట్టు చెబుతున్నాయి. 30 ఏళ్లుగా పాఠశాల విద్యను ప్రపంచ బ్యాంకు ప్రయోగశాలగా మారిస్తే, పాలకులకు విద్యా వ్యవస్థ రాజకీయ ప్రయోగశాలుగా మారిపోయింది. ఏదో చేస్తామని చెబుతున్న కొత్త పాలకులకు చూస్తుండగానే ఏడాది గడిచిపోతున్నది. అర్థం చేసుకుంటున్నామని, అద్భుత ప్రయోగాలు, ఫలితాలు తీసుకొస్తామని, ఆంధ్ర మోడల్ విద్యా విధానమని గొప్పలు చెబుతున్నారు. ఉపాధ్యాయులు, సంఘాలు యాప్‌ల భారం ఏం తగ్గిందని ఆందోళన చెందుతున్నారు. సంవత్సరం పొడవునా 'అపార్' అపారమైన కష్టాలతోను, ఉపాధ్యాయులు నిరంతర శిక్షణలలోనే మునిగి తేలుతున్నారు. ప్రాజెక్టులు-డబ్బులు-శిక్షణలు-ఖర్చు చేయాలి కాబట్టి శిక్షణలు ఆపలేమని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నారు.

ఆంధ్ర మోడల్ విద్యా విధానంలో, 117 విద్యా వ్యవస్థలో మార్పులు ఏమిటి? మీడియం, ప్లస్ 2, సిబిఎస్‌ఇ సిలబస్, పరీక్షలు, యూపీ పాఠశాలలు, ఇంటర్ విద్యలలో ఏ మార్పులు ముందుకొస్తాయో, డిఎస్‌సి ఎప్పుడు అమలు అవుతుందో ఇప్పటికీ స్పష్టత లేదు. ఏ విధానం తప్పయినా సంఘాలు విమర్శించరాదని, విధానాలతో సంఘాలకు పనేమిటని, మా విద్యా విధానం తప్పయితే ప్రజలు తమ తీర్పుల ద్వారా తేల్చుకుంటారని గత ప్రభుత్వం చెప్పింది. ప్రజలు అలాగే తీర్పు చెప్పారు. ఈ ప్రభుత్వం విద్యా విధానంలో తీసుకు రావాల్సిన మార్పులు ప్రజాస్వామ్యయుతంగా చర్చించి మంచి నిర్ణయాలు తీసుకోవాలి. అంతేగాని ఎవరేం చెప్పినా వినం. అనుకున్నదే చేస్తామంటే విద్యా వ్యవస్థకు, విద్యార్థులకు కష్టం, నష్టం జరుగుతుంది. చివరకు ప్రభుత్వ విద్యావ్యవస్థ ఇంకా బలహీనమవుతుంది.

1968 మొదటి జాతీయ విద్యా విధానంలో కొఠారి కామన్ స్కూల్ విధానానికి వీడ్కోలు చెప్పిన ప్రభుత్వాలు, 2020 మూడో జాతీయ విద్యా విధానం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కమ్యూనల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని తహతహలాడుతున్నాయి. ప్రాథమిక విద్య నుండి విశ్వ విద్యాలయ విద్య దాకా కనీసం రాజ్యాంగ విలువల నీడలు - జాడలు లేకుండా కేంద్ర, రాష్ట్ర పాలకులు జాగ్రత్త పడుతున్నారు. తస్మాత్ జాగ్రత్త.

/ వ్యాసకర్త పిడిఎఫ్ ఎమ్మెల్సీ /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

కాఫీ సాగు విస్తరణకు సర్వే

పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా): పార్వతీపురం మన్యం జిల్లా ఉద్యాన శాఖాధికారి ఆధ్వర్యంలో కాఫీ బోర్డు ఐటిడిఎ, శాస్త్రవేత్తల బృందం శతాభి, తంగలాం, గరిసిగుడ్డి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో కాఫీ పంట విస్తరణకు సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా శతాభి గ్రామంలో కాఫీ పంటకు కావాల్సిన అనుకూల పరిస్థితుల గురించి కాఫీ బోర్డు లైసెన్ ఆఫీసర్ ఎస్.రమేష్ వివరించారు. ఏప్రిల్ నుండి వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కాఫీ బాగా పండుతుందని, ఉరుడు పండాలంటే నీడ అవసరమని, దీనికోసం మామిడి, పనస వంటి ఆకు రాల్చని మొక్కలను పెంచుకోవాలని సూచించారు.

వరదలు, విపత్తులపై నేడు మాక్ ఎక్సర్‌సైజ్

- **విపత్తుల నిర్వహణ శాఖ**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తుపాను, వరదలు వంటి విపత్తులపై ఎన్‌డిఎంఎ, ఎస్‌డిఎంఎ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆధ్వర్యాన బుధవారం విశాఖ ఎయిర్‌పోర్టులో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను సమయంలో ఎలా నడుచుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించడం, భవిష్యత్తులో విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మాక్ డ్రిల్ ఉపయోగపడుతుందన్నారు. విపత్తుల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించుకోవడమే లక్ష్యమన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవడానికి తమ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమంలో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, సివిల్, డిఫెన్స్, నేవీ, ఫైర్ సర్వీసెస్, పోలీస్, మెడికల్ అండ్ హెల్త్, పిఆర్ అండ్ ఆర్‌డి, ఆపద మిత్ర వలంటీర్లు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బీమా డబ్బు కోసం చెల్లిని చంపిన అన్న

- **ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన**

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు బీమా డబ్బుల కోసం సొంత చెల్లిని అన్న చంపిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం, పునుగోడు గ్రామానికి చెందిన మాలపాటి అశోక్‌కుమార్ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. చెల్లెలు మాలపాటి సంధ్య తన భర్తతో విభేదాల కారణంగా అన్నతో కలిసి ఉంటున్నారు. తన చెల్లెలు పేరు మీద రూ.కోటి బీమాను అశోక్‌కుమార్ తీసుకున్నాడు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో దివాలా తీయడం, అప్పుల నుంచి గట్టెక్కేందుకు చెల్లినిను చంపి ఆమె బీమా డబ్బులు కాజేయాలని పన్నాగం పన్నాడు.

ఈ క్రమంలో ఫిబ్రవరి నాలుగున ఆమెను కారులో ఆస్పత్రికి తీసుకువెళ్లే సమయంలో నిద్రమాత్రలు ఇచ్చాడు. స్పృహ తప్పిపోయిన తర్వాత ముఖంపై దిండుతో అదిమి చంపేశాడు. దీన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు తన కారును చెట్టుకు ఢీకొట్టాడు. పోస్టుమార్టం రిపోర్టులో ఈ విషయాలు వెల్లడికాకుండా ఉండేందుకు ఓ వ్యక్తికి రూ. మూడు లక్షలు సైతం ఇచ్చాడు. సంధ్య తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బీమా నగదు కోసం అశోక్‌కుమారే చెల్లిని చంపినట్లు పోలీసులు నిర్ధారించుకున్న తర్వాత నిందితుడిని అరెస్ట్ చేశారు.

కిమ్స్ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్

- **మహిళ కడుపులో 15 కిలోల భారీ కణితి తొలగింపు**

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రకాశం జిల్లా ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్ జరిగింది. ఓ మహిళ కడుపులో ఉన్న 15 కిలోల కణితిని వైద్యులు ఆపరేషన్ ద్వారా తొలగించారు. 40 సంవత్సరాల వయస్సు గల మహిళ వారం రోజుల నుండి పసర వాంతులు, కడుపు నొప్పి, పొట్ట ఉబ్బరంతో బాధపడుతూ కిమ్స్ హాస్పిటల్‌లోని గ్యాస్ట్రో, లాప్రోస్కోపీ సర్జన్ డాక్టర్ కార్తీక్‌బాబు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజనిని సంప్రదించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ఆమె కడుపులో పెద్ద కణితి ఉందని గుర్తించారు. ఆ కణితి పేగులపై ఒత్తిడి చేయడం వల్ల పసర వాంతులు అవుతున్నాయని నిర్ధారించారు. డాక్టర్ సుజని, డాక్టర్ కార్తీక్‌బాబు, డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ రామకష్ణ, డాక్టర్ అనూషల వైద్య బందం ఆమెకు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ఆ కణితిని తొలగించారు. కణితి చాలా క్లిష్టమైన అవయవాలు అయిన అండాశయం, పేగులు, గర్భసంచి, పెద్ద నరాలకు గట్టిగా అనుకొని ఉందని వైద్యులు తెలిపారు. ఇంతటి భారీ పరిమాణంగల కణితిని అండాశయం నుండి తొలగించడం చాలా అరుదని, క్లిష్టతరమని కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీహరిరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి అరుదైన వైద్య సేవలు అందించడంలో కిమ్స్ హాస్పిటల్స్ ఎప్పుడూ ముందుంటాయని ఈడి గిరినాయుడు తెలిపారు. సర్జరీని విజయవంతం చేసిన వైద్య బృందాన్ని కిమ్స్ సిఒఒ అంకిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

నిరసనల నేపథ్యంలో సెర్బియా ప్రధాని రాజీనామా

బెల్గ్రేడ్ : సెర్బియా ప్రధాని మిలోస్ వుసెవిక్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. నవంబరులో నిర్మాణంలో వున్న కాంక్రీట్ స్లాబ్ కూలిపోయి 15మంది మరణించిన ఘటనపై వారాల తరబడి కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఈ రాజీనామా వెలువడింది. నొవిశాడ్ నగరంలో చోటు చేసుకున్న ఈ సంఘటనతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. అవినీతికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు చోటు చేసుకున్నాయి. అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ నియంత పాలన పట్ల ప్రజల్లో అసమ్మతి, అసంతృప్తి మరింత పెరిగాయి. సెర్బియాలో ప్రజాస్వామిక స్వేచ్ఛను అణగదొక్కుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. సెర్బియాలో ఉద్రిక్తతలు తగ్గించడమే తన రాజీనామా ఉద్దేశమని వుసెవిక్ పత్రికా సమావేశంలో ప్రకటించారు. ఉద్రిక్తతలు, ఆగ్రహావేశాలను తగ్గించుకుని, తిరిగి చర్చలకు రావాలన్నదే తన విజ్ఞప్తి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాని రాజీనామాతో పార్లమెంటరీ ఎన్నికలు త్వరగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెర్బియా పార్లమెంట్ ఈ రాజీనామాను ఆమోదించాల్సి వుంది. 30 రోజుల్లోగా కొత్త ప్రభుత్వాన్ని ఎంపిక చేయాల్సి వుంది లేదా మధ్యంతర ఎన్నికలకు పిలుపునివ్వాల్సి వుంటుంది. రాజధాని బెల్గ్రేడ్‌లో సోమవారం వేలాదిమంది యూనివర్శిటీ విద్యార్థులు 24గంటల పాటు రహదారుల దిగ్బంధనం నిర్వహించారు.

ముస్లింల ఆస్తి వివాదాలకు సెక్యులర్ చట్టాలు వర్తింపజేయొచ్చా?

- **కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ : ముస్లిం కుటుంబంలో జన్మించిన వ్యక్తి ఆస్తి వ్యవహారాలకు సంబంధించి సెక్యులర్ చట్టాలను అనుసరించవచ్చా లేక ముస్లిం పర్సనల్ లా అయిన షరియాకే కట్టుబడి వుండాలా అని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రాన్ని ప్రశ్నించింది. ఏకీకృత పౌర స్మృతి (యుసిసి)పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్, కేంద్రానికి ఈ విషయమై సమాధానం చెప్పేందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను మే 5కి వాయిదా వేసింది. కేరళకు చెందిన సఫియా అనే మహిళ ఈ విషయమై పిటిషన్ దాఖలు చేసింది. తన మొత్తం ఆస్తిని తన కుమార్తెకే ఇవ్వాలనుకుంటున్నానని ఆమె తెలిపింది. తన కుమారుడు ఆటిజంతో బాధపడుతున్నాడని, అతడి బాగోగులు తన కుమార్తె చూసుకుంటుందని పిటిషనర్ తెలిపింది.

షరియా ప్రకారం, తల్లిదండ్రులు తమ ఆస్తిని విభజించాల్సి వస్తే కుమార్తె వాటా కన్నా రెట్టింపు కొడుకుకు లభించాల్సి వుంటుంది. ఇక్కడ తన కేసులో ఒకవేళ ఆటిజం (డౌన్ సిండ్రోమ్)తో బాధపడుతున్న తన కుమారుడు చనిపోతే తన కుమార్తెకు కేవలం మూడో వంతు మాత్రమే ఆస్తి దక్కుతుందని, మిగిలిన ఆస్తి అంతా బంధువుకు వెళ్లిపోతుందని పిటిషనర్ పేర్కొంది. తాను, తన భర్త ముస్లిం ఆచారాలను, సాంప్రదా యాలను పాటించడం లేదని, అందువల్ల తమ ఆస్తిని భారత వారసత్వ చట్టం లోని మార్గదర్శకాలకు అనుగు ణంగా పంచడానికి తనకు అనుమతినివ్వాల్సిందిగా ఆమె తన పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం భారత వారసత్వ చట్టం ముస్లింలకు వర్తించడం లేదు. సఫియా పిటిషన్ దీన్ని సవాలు చేసింది. ఈ విషయం కోర్టులో ప్రస్తావనకు వచ్చినప్పుడు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, ఇది చాలా ఆసక్తికరమైన కేసు అని వ్యాఖ్యానించారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ ఉమ్మడి పౌర చట్టాలు అమలు కావాలని పేర్కొంటూ బిజెపి ఏకీకృత పౌర స్మృతి తీసుకువచ్చిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. క్రిమినల్ చట్టాలు అందరికీ సమానమే అయినా వారసత్వం, దత్తత, వివాహం, విడాకులు వంటి అంశాలకు సంబంధించిన చట్టాలు మాత్రం వేర్వేరు మతాలకు వేర్వేరుగా వున్నాయి.

యమునాలో 'విషం' విమర్శలు

- **ఆధారాలు చూపాలని కేజ్రీవాల్‌కు ఇసి లేఖ**

న్యూఢిల్లీ : హర్యానాలోని బిజెపి ప్రభుత్వం యమునా నదిలోకి కావాలనే పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన విమర్శలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఈ విమర్శలకు సంబంధించిన ఆధారాలను బుధవారం రాత్రి 8 గంటల్లోపు అందించాలని ఆప్‌కు లేఖ రాసింది. హర్యానా నుంచి ఢిల్లీకి ప్రవహిస్తున్న యమునా నదిలో అమోనియం స్థాయి ఆరు రెట్లు అధికంగా ఉందని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం విమర్శిస్తోంది. వీటివల్ల నగరవాసులకు ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఈ విషయాలన్నీ హర్యానా ప్రభుత్వానికి తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారని పేర్కొంది. నదిలో విషం కలపడం ద్వారా ప్రజలను హతమార్చాలని హర్యానా ప్రభుత్వం చూస్తోందని కేజ్రీవాల్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి కూడా యమునను కలుషితం చేయడం 'జల ఉగ్రవాదం'గా పేర్కొన్నారు. యమునాలో వ్యర్థాల వివాదంపై హర్యానా ప్రభుత్వం నుంచి ఎన్నికల సంఘం ఇటీవల వివరణ కోరింది.

మరో ఇద్దరు మృతి

- **అగ్నిప్రమాద ఘటనలో నాలుగు చేరిన మృతుల సంఖ్య**

ప్రజాశక్తి- మండవల్లి

గ్యాస్ లీకై ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఈ ప్రమాదంలో ఇప్పటికే ఆదివారం ఉదయం ఒక బాలుడు, సోమవారం ఒక యువకుడు మృతి చెందగా, మంగళవారం మరో ఇద్దరు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండవల్లి మండలం పత్తిపాటి స్టేజీ వద్ద ఈ నెల 24వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో పది తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు గాయాలపాలయ్యారు. గుంటూరు ఆస్పత్రిలో ఆదివారం తెల్లవారుజామున బాలుడు విక్కీ (4) మృతి చెందాడు. నక్కల చరణ్ కిరణ్ (19)ను పరిస్థితి విషమించడంతో బంధువులు మెరుగైన వైద్య నిమిత్తం మద్రాసులోని వేలూరు ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి 10:30 గంటలకు ఆయన మరణించారు. మంగళవారం ఉదయం 4.20 గంటలకు నక్కల కార్తీక్ (17), డబ్బా పాప 6.00 చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గుంటూరులో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతితో నక్కల వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు వేలేరు చేరుకుని మృతదేహాలకు పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: ఋణగ్రహీతలు: 1) శ్రీ సయ్యద్ మొహిద్దీన్, తండ్రి: సయ్యద్ కరీముద్దీన్, డి.నెం.77-38-15, శాంతి నగర్, ప్రకాష్ నగర్, విజయవాడ (అర్బన్), పాయకాపురం, కృష్ణాజిల్లా, ఏపి-520015. **కో-ఆబ్లిగెంట్: శ్రీ సయ్యద్ సిరాజుద్దీన్,** తండ్రి: సయ్యద్ మొహిద్దీన్, డి.నెం. 77-38-15, శాంతి నగర్, ప్రకాష్ నగర్, విజయవాడ (అర్బన్), పాయకాపురం, కృష్ణాజిల్లా, ఏపి-520015.

విషయం: సెక్యూర్‌టైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ సయ్యద్ మొహిద్దీన్ కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.23-09-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.18-12-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.23-09-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
ఏ-షెడ్యూల్: కృష్ణాజిల్లా, ఎస్.ఆర్.ఓ విజయవాడ అర్బన్ లిమిట్స్, పాయకాపురం గ్రామ భాగం, ఆర్.ఎస్.నెం.80, సిటీ ప్లాజా, డోర్.నెం.77-85/1-25, 26, 27, 28లో 444.0 చ.గ.లు లేదా 371.28 చ.మీ.లలో అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 53.0 చ.గ.లు లేదా 44.31 చ.మీ.లకు హద్దులు: **తూర్పు:** ప్లాట్ నెం.29, 30", **ఉత్తరం:** రోడ్డు, **పడమర:** రోడ్డు, **దక్షిణం:** విజయవాడ నుండి నూజివీడు రోడ్డు. **బి-షెడ్యూల్:** "సిటీ ప్లాజా", 3వ అంతస్తు, 1252-0 చ.అ.ల ప్లింత్ ఏరియా, 121-0 చ.అ.ల కామన్ ఏరియా మరియు 142-0 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం. టి.ఎఫ్.2 షెడ్యూల్-ఏ లో చూపబడిన స్థలంలో నిర్మించబడినది దానికి హద్దులు: **తూర్పు:** శూన్యాకాశము, **ఉత్తరం:** శూన్యాకాశము, **పడమర:** శూన్యాకాశము, **దక్షిణం:** కారిడార్ మరియు మూడవ అంతస్తు టి.ఎఫ్-1.

తేది: 27-01-2025 — **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. మెస్సర్స్ శ్రీ చంద్ర ఎంటర్‌ప్రైజెస్, ప్రొ: మేకల ఏడుకొండలు, డి.నెం. 19-9-176, హనుమాన్ నగర్, గుంటూరు-522001. **2. మేకల ఏడుకొండలు (ప్రొప్రయిటర్),** తండ్రి: చంద్రరావు, డి.నెం.35-102, ఫణిధరం, ధరంపల్లి, తాడికొండ, గుంటూరు-522018. **3. నల్లపనేని గరటయ్య (హామీదారు),** తండ్రి: శివ లింగయ్య, హెచ్.నెం. 6-39, గొర్లవారిపాలెం, గుంటూరు-522018. **4. పసల కనక వీర రాజు (హామీదారు),** తండ్రి: మల్లయ్య, డి.నెం. 5/100, ఫణిధరం గ్రామం, దామరపల్లి (పోస్ట్), తాడికొండ మండలం, గుంటూరు జిల్లా-522018. **5. నల్లపనేని రామాంజనేయులు (హామీదారు),** తండ్రి: శేషగిరిరావు, డోర్ నెం.6-10, బొడ్డురాయి బజార్ దగ్గర, గొర్లవారిపాలెం గ్రామం, గుంటూరు-522018. **6. చల్లమల్ల మల్లి ఖార్జునరావు (హామీదారు),** తండ్రి: యల్లమంద, డోర్ నెం.5-69-51, 6/19, బ్రాడీపేట, గుంటూరు-522002. **7. మేకల సురేష్ బాబు,** తండ్రి: చంద్రరావు (హామీదారు), డోర్ నెం. 5-10-2, ఫణిధరం గ్రామం, దామరపల్లి (పోస్ట్), తాడికొండ మండలం, గుంటూరు జిల్లా-522018.

రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యుర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను ఆహ్వానించడమైనది.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	మెగావత్ బాలాజీ నాయక్ (రుణగ్రహీత), మెగావత్ రాజ (సహ రుణగ్రహీత)/ LHVJW00001365404	ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట మండలం, జయంతిపురం గ్రామం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.36/2 లో ఆ ఆర్‌సిసి రూఫ్డ్ ఇల్లు మొత్తం బేరింగ్ డో.నం.1 91, ప్లాట్ నం.2ఎ భాగం మరియు ప్లాట్ నం.3 (ఉత్తర భాగం) హద్దులు : ఉత్తరం : బి.వెంకటేశ్వర్లు మరియు ఎమ్.కుమార్ ఇల్లు, దక్షిణం : ఎమ్.మంత్రియ నాయక్ మరియు బి.సాయిదా నాయక్ ఆస్తి, తూర్పు : రోడ్డు, పడమర : బి.బాల ఆస్తి/ స్వాధీనతా తేది : 23-జనవరి-25	11-10-2024 Rs. 11,68,533.1/-	విజయవాడ

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 29 జనవరి, 2025, ప్రదేశం : కృష్ణ — **అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

YES BANK
యస్ బ్యాంక్ లిమిటెడ్
క్రాంతి ఆర్కేడ్, డి.నెం.40/1/59, 2వ అంతస్తు, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్

SARFAESI చట్టం నిబంధన 13(2) ప్రకారం నోటీసు ప్రకటన

ఈ క్రింద చెప్పబడిన ఋణగ్రహీత(లు), హామీదారు(లు)/తనఖాదారు(లు) తమ ఋణ ఖాతా అసలు మరియు వడ్డీ చెల్లింపుతో విఫలమైనందున పై బ్యాంకు వారిచే నిరర్ధక ఆస్తులు (ఎన్‌పిఏ)గా గుర్తించబడినవి. కనుక పై చట్టం, నిబంధన 13(2) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం, వీరికి మా వద్ద గల చివరిగా తెలిసిన చిరునామాలతో నోటీసు పంపగా మాకు తిరిగి వచ్చినందున ఈ బహిరంగ ప్రకటన జారీచేయడమైనది.

1. **ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు, తనఖాదారుల పేర్లు :** మెస్సర్స్ మనీషా హోసరీస్ (ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ లేటు శ్రీ కొండయ్య దాసరి (ఋణగ్రహీత), లేటు కొండయ్య దాసరి, శ్రీమతి దాసరి సునీత (సహ-ఋణగ్రహీత, లేటు కొండయ దాసరి కొండయ్య చట్టబద్ధ వారసురాలు మరియు భార్య), దాసరి మనీషా (లేటు కొండయ దాసరి కొండయ్య చట్టబద్ధ వారసురాలు మరియు కుమార్తె) మరియు దాసరి రేవంత్ (లేటు కొండయ దాసరి కొండయ్య చట్టబద్ధ వారసుడు మరియు కుమారుడు)
ఒప్పందం నెం.: MOR012400915060
ఋణ విధానం & లోన్ అమౌంట్: మార్టగేజ్ లోన్ రూ.42,00,000/- (అక్షరాలా నలభై రెండు లక్షల రూపాయలు మాత్రమే)
13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.03.01.2025 నాటికి రూ.27,46,281.94 పై (అక్షరాలా ఇరవై ఏడు లక్షల నలభై ఆరు వేల రెండు వందల ఎనభై ఒక్క రూపాయలు మరియు తొంభై నాలుగు పైసలు మాత్రమే)
ఎన్‌పిఏ తేది: 13-జనవరి-2023 — **నోటీసు తేది:** 03-జనవరి-2025
సెక్యూర్డ్ ఆస్తి వివరాలు: ఆంధ్రప్రదేశ్, విజయవాడ, భవానీపురం, మొత్తం భూ విస్తీర్ణం 3256-7 చ॥గ॥లలోని అవిభాజ్యపు వాటా భూమి 50 చ॥గ॥, కార్ పార్కింగ్ 60 చ॥గ॥, 1075 చ॥అ॥లలో రివర్ ఫైన్ అపార్ట్‌మెంట్, డోర్ నెం.75-6-44/1, జిఎఫ్ 104, గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.104 నకు **హద్దులు: ఫ్లాట్ హద్దులు: ఉత్తరం:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్. **మొత్తం బిల్డింగ్‌నకు హద్దులు: ఉత్తరం:** సయ్యద్ అలీ ఆస్తి కొంత మరియు ఇతరుల ఆస్తి కొంత, **దక్షిణం:** అబ్దుల్ వాహద్ ఆస్తి, **తూర్పు:** గుప్తా ఆస్తి కొంత మరియు రోడ్డు కొంత, **పడమర:** 60' వెడల్పు రోడ్డు మరియు ఇతరుల ఆస్తి.

కనుక పైన చెప్పిన ఋణగ్రహీత(లు) మరియు / లేదా, హామీదారు(లు) తనఖాదారు(లు), పై బ్యాంక్ వారికి బకాయి మొత్తం ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోపుగా చెల్లించవలెను. ఒక వేళ పై వ్యక్తులు విఫలమైనచో **SARFAESI** చట్టం యొక్క నిబంధన 13 యొక్క సబ్ సెక్షన్ (4) ప్రకారం, నోటీసు గడువు 60 రోజులు పూర్తి అయిన తరువాత (గడువు ముగిసిన) ఆ తదుపరి చర్యలు తీసికొనబడును.
మరియు, **SARFAESI** చట్టం యొక్క నిబంధన 13(8) ప్రకారం మా బకాయి వసూలు అగునంత వరకు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు కాస్ట్ కలిపి అమ్మకం తేదీ ప్రకటన ముందువరకు, ఈ సెక్యూర్డ్ ఆస్తులను ఎట్టి అమ్మకం, బదలాయింపు జరపరాదని మీ దృష్టికి తెలియపరచడమైనది.

తేది: 23-01-2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, యస్ బ్యాంక్ లిమిటెడ్.,

తాత్కాలిక వేదిక కుప్పకూలి ఏడుగురు మృతి

- 60మందికి గాయాలు
- ఉత్తరప్రదేశ్‌లో ఘోరం

భాగ్‌పట్ : ఉత్తరప్రదేశ్‌లోని భాగ్‌పట్ జిల్లాలో జైన ఆలయంలో మతపరమైన ఉత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన తాత్కాలిక వేదిక కుప్పకూలి ఏడుగురు మరణించగా, దాదాపు 60మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా సీనియర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టారు. తాత్కాలిక వేదిక కింద చిక్కుకుపోయిన కొంతమంది సందర్శకులను, పోలీసు సిబ్బందిని వెలికి తీయడానికి వెంటనే ప్రయత్నాలు చేపట్టారు. మంగళవారం ఉదయం 8గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. శ్రీ దిగంబర జైన్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో లార్డ్ ఆదినాథ్ అభిషేకం నిర్వహిస్తుండగా, ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వారిలో 20మందికి ప్రాథమిక చికిత్స చేసి పంపారు. మరో 39మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో దాదాపు వంద మంది అక్కడ వున్నారు. 65అడుగుల ఎత్తైన తాత్కాలిక వేదికపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన చెక్క మెట్లు విరిగిపోవడంతో ఒక్కసారిగా వేదిక కుప్పకూలింది. దాంతో వేదికపై వున్న భక్తులు, ఆ పక్కనే వున్న వారు కిందపడిపోయారని పోలీసులు తెలిపారు. ప్రమాదంపై విచారణ జరపాలని ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

శ్రామికవర్గ రాజ్యంతోనే ప్రజాసమస్యలకు విముక్తి

(మొదటిపేజీ తరువాయి)

రక్షిస్తామని ప్యాకేజీలు ప్రకటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు చెబుతున్నదొకటి, ప్లాంట్‌లో జరుగుతున్నది మరొకటిగా గమనించిన కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిర్వహిస్తోన్న ఉద్యమాలను బలపరచవలసి ఉందన్నారు. ఆ దిశగా ఉద్యమిస్తున్న సిపిఎంకు మరింత మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ చరిత్రను, పోరాటాలను గుర్తు చేశారు. ప్రజల సంపదైన స్టీల్‌ప్లాంట్ ప్రజలకు చెందాల్సి ఉందన్నారు. ప్లాంట్ పరిరక్షణకు మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు సిపిఎం చేసిన పోరాటాలను వివరించారు. ప్రజాధనం ప్రజలకు ఉపయోగపడాలన్న నినాదంతో సిపిఎం మొదటి నుంచీ పోరాడుతోందన్నారు. ప్రజలు ప్రత్యక్ష పోరాటాలకు దిగి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలని కోరారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రజా పోరాటాలను అపహాస్యం చేస్తున్న ప్రభుత్వాధినేతలకు గుణపాఠం చెప్పే విధంగా ఉద్యమాలకు పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, నాయకులు కెఎం.శ్రీనివాస్, పి.మణి, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.శ్రీనివాసరాజు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వైటి.దాస్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, రమణమూర్తి, దొమ్మేటి అప్పారావు, సిహెచ్.సన్యాసిరావు, శ్రీనివాస్, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. జాతాకు యు.రామస్వామి, వై.రాము తదితరులు నాయకత్వం వహిస్తున్నారు. ఉద్యమ కాగడాను వారికి నర్సింగరావు, లోకనాథం తదితరులు అందజేశారు.

బిజెపినే అత్యంత ధనిక పార్టీ

- రూ.7113 కోట్ల నిధులు
- రూ.857 కోట్లతో కాంగ్రెస్‌కు రెండోస్థానం
- ఎన్నికల బాండ్లతో అత్యధిక ఆదాయం కమలం పార్టీకే

న్యూఢిల్లీ : భారత దేశంలో అత్యంత ధనిక పార్టీగా బిజెపి మరోసారి అవతరించింది. కేంద్రంలోని అధికార కమలం పార్టీ వార్షిక ఆదాయం రోజురోజుకూ పెరిగిపోతోంది. 2024 మార్చి 31 నాటికి బిజెపి వద్ద రూ.7,113.80 కోట్ల నిధులున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రెండో స్థానంలో కాంగ్రెస్ వద్ద రూ.857 కోట్లు ఉన్నట్లు ఇసిఐ పేర్కొంది. 2023-24లో లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన సమయంలో బిజెపి రూ.1754 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం 2022-23లో ఖరు చేసిన రూ.1092 కంటే 60 శాతం అధికం. కాంగ్రెస్ పార్టీ 2023- 24లో రూ.619.67 కోట్లు, 2022-23లో రూ.192.56 కోట్లు ఖర్చు చేసింది.

ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపి అత్యధిక ఆదాయం

ఎన్నికల బాండ్ల ద్వారానూ బిజెపికే అత్యధిక ఆదాయం లభించింది. 2022-23లో రూ.2,360.8 కోట్లుగా ఉన్న ఆ పార్టీ ఆదాయం మరుసటి సంవత్సరానికి ఏకంగా 83 శాతం పెరిగి రూ.4,340.5 కోట్లకు చేరింది. ఇందులో రూ.1,685.6 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చినవేనని ఎన్నికల కమిషన్‌కు బిజెపి సమర్పించిన తాజా వార్షిక ఆడిట్ నివేదిక చెబుతోంది. ఏ ఇతర పార్టీ కూడా బాండ్ల రూపంలో ఇంత భారీగా వార్షిక ఆదాయం పొందలేదు. ఇదే కాలంలో కాంగ్రెస్ ఆదాయం కూడా రూ.452.4 కోట్ల నుండి రూ.1,225 కోట్లకు.... అంటే 170 శాతం పెరిగింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఎన్నికల బాండ్ల రూపంలో తన ఆదాయాన్ని 384 శాతం మేర పెంచుకుంది. 2022-23లో కాంగ్రెస్‌కు ఎన్నికల బాండ్ల ద్వారా రూ.171 కోట్ల ఆదాయం లభిస్తే, 2023-24లో రూ.828.4 కోట్లు వచ్చింది. బాండ్లకు సంబంధించినంత వరకూ బిజెపి తర్వాత కాంగ్రెస్‌కే ఎక్కువ ఆదాయం లభించింది.

2023-24లో బాండ్ల రూపంలో బిఆర్‌ఎస్‌కు రూ.685.5 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.612.4 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక ఖర్చుల విషయానికి వస్తే గత ఆర్థిక సంవత్సరంలో బిజెపి 2,211.7 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఇది 62 శాతం అధికం. ఇందులో ఎన్నికలు, సాధారణ ప్రచారంపై ఆ పార్టీ రూ.1,754 కోట్లు ఖర్చు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ వార్షిక వ్యయం రూ.1,025.20 కోట్లు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కోసం ఆ పార్టీ రూ.49.6 కోట్లు ఖర్చు చేసింది. తొలి విడత భారత్ జోడో యాత్రకు రూ.71.8 కోట్లు ఖర్చయ్యాయి.

2023-24 ఆడిట్ నివేదికలో బిజెపి ప్రకటించిన స్వచ్ఛంద విరాళాలు రూ.3,967 కోట్లు. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా రూ.1,685.6 కోట్లు, ఆజివాన్ సహయోగ్ నిధి ద్వారా రూ.236.3 కోట్లు, ఇతర విరాళాల ద్వారా రూ.2,042.7 కోట్లు సమకూరాయి. ఆ పార్టీకి వ్యక్తిగత దాతలు రూ.240 కోట్లు, కార్పొరేట్లు రూ.1,890 కోట్లు, సంస్థలు-సంక్షేమ సంఘాలు రూ.101.2 కోట్లు, ఇతరులు రూ.50 కోట్లు అందజేశారు. గత సంవత్సరం మార్చి 31 నాటికి బిజెపి చేతిలో రూ.109.2 కోట్లు, బ్యాంకుల్లో రూ.1,627.2 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో 5,377.3 కోట్లు ఉన్నాయి.

బెంగాల్‌లో విద్యార్థులపై లాఠీ

మంత్రికి వినతినిచ్చేందుకు వచ్చిన ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలపై పోలీసుల జులుం

అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న విద్యార్థినులు

కొల్‌కతా : ఉపాధ్యాయుల నియామకాల్లో అవకతవకలపై మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడమే కాకుండా, అనేక మందిని అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కొల్‌కతాలో సోమవారం ఈ దారుణం చోటు చేసుకుంది. నగరంలోని సాల్ట్ లేక్‌లో రాష్ట్ర విద్యా శాఖ ప్రధాన కార్యాలయం ఉన్న బికాష్ భవన్ వద్దకు సోమవారం రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుంచి ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు చేరుకున్నారు. 'క్యాష్ ఫర్ జాబ్ స్కూల్ రిక్రూట్‌మెంట్ స్కాం'కు వ్యతిరేకంగానూ, విద్యా సంస్థల పనితీరులో జోక్యం చేసుకుంటున్న అధికార టిఎంసి తీరుకు వ్యతిరేకంగానూ బికాష్ భవన్ వెలుపల నిరసన తెలిపారు. రాష్ట్ర విద్యా మంత్రికి వినతిపత్రం అందజేసేందుకు ప్రయత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి విద్యార్థులు ముందుకు వెళ్లకుండా నిలువరించారు. దీంతో, ప్రశ్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జికి పాల్పడ్డారు. విద్యార్థినులతోసహా దాదాపు 100 మందిని బలవంతంగా వ్యానుల్లోకి ఎక్కించి, అరెస్టులకు పాల్పడ్డారు. మహిళల పట్ల పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. పోలీసుల తీరును నిరసిస్తూ పలు ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జాయింట్ సెక్రటరీ సృజన్ భట్టాచార్య తెలిపారు.

స్తంభించిన బంగ్లాదేశ్ రైల్వే

- కార్మికుల సమ్మెతో దేశవ్యాప్తంగా రద్దయిన రైళ్లు

ఢాకా : అధిక పెన్షన్లు, ఇతర ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ రైల్వే సిబ్బంది సమ్మెకు దిగడంతో మంగళవారం బంగ్లాదేశ్‌వ్యాప్తంగా రైళ్లు రద్దయ్యాయి. ఫలితంగా వేలాదిమంది ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. సరుకు రవాణాకు అంతరాయం కలిగింది. సిబ్బంది కోరుతున్న డిమాండ్ల పరిష్కారం కోసం మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంతో సోమవారం పొద్దుపోయిన తర్వాత జరిగిన సమావేశం విఫలమవడంతో సమ్మెకు పిలుపిచ్చినట్లు బంగ్లాదేశ్ రైల్వే రన్నింగ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తాత్కాలిక అధ్యక్షుడు సైదుర్ రహమాన్ చెప్పారు. తమ డిమాండ్లు ప్రభుత్వం ఆమోదించని పక్షంలో సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఏటా ఆరున్నర కోట్ల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే బంగ్లాదేశ్ రైల్వేలో 25వేల మంది ఉద్యోగులు వున్నారు. 36వేల కిలోమీటర్లకు పైగా రైల్వే నెట్‌వర్క్ వుంది. రాజధాని ఢాకాలోని ప్రధాన కమలాపూర్ రైల్వే స్టేషన్‌పై వందలాదిమంది ప్రయాణికులు దాడి చేశారు. వాయవ్య ప్రాంతంలోని రాజ్‌షాహి నగరంలో ఆగ్రహోదగ్రులైన ప్రయాణికులు స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సిబ్బందిపై దాడి చేశారు. సమ్మె వార్త తెలియక వచ్చిన వారందరూ గంటల తరబడి చిక్కుకుపోవాల్సి వచ్చింది. కాగా అధికారులు ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేశారు. దేశంలోనే రెండవ అతిపెద్ద నగరమైన చట్టోగ్రామ్‌లో రైల్వే సిబ్బంది నిరసనలకు దిగారు.

శిథిలాల మధ్య బతుకు పోరాటం!

- స్వస్థలాలకు చేరిన 3లక్షలమంది పాలస్తీనియన్లు !

గాజా, జెరూసలేం : కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత దక్షిణ గాజా నుండి మూడు లక్షలమందికి పైగా పాలస్తీనియన్లు ఉత్తర గాజాకు చేరుకున్నారు. స్వస్థలాలకు రావాలనే ఉత్సాహంతో వచ్చినా ఇక్కడి రాళ్ల రప్పల మధ్య బతుకు ఎలా కొనసాగించాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. తమ ఇళ్ల ధ్వంసమైన ఆ శిథిలాల్లోనే వారు తాత్కాలిక ఆశ్రయాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేయడం కనిపిస్తోంది. మరోసారి తమ జీవితాన్ని మొదటి నుండి ఆరంభించేందుకు వారు సమాయత్తమవుతున్నారని మీడియా వర్గాలు తెలిపాయి. 15మాసాల తర్వాత మొదటిసారిగా గాజాకు వంట గ్యాస్ వచ్చింది. పరిమిత స్థాయిలోనే అయినప్పటికీ రావడం ఆరంభమైందని ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది. మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ అణచివేత చర్యలకు కనుచూపు మేరలో అంతం కనిపించడం లేదు. గత 48గంటల్లో గాజాలోని ఆస్పత్రులకు 48 మృతదేహాలు వచ్చాయని ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ సాధించిన విజయంగా ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేనీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో ఇజ్రాయిల్ తలలు వంచిందని అన్నారు.

యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎతో సంబంధాలు తెగతెంపులు

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్య సమితి సహాయక సంస్థ యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎతో అన్ని సంబంధాలను తెగతెంపులు చేసుకోనున్నట్లు ఇజ్రాయిల్ రాయబారి ఐక్యరాజ్య సమితికి మంగళవారం తెలిపారు. ఈ సంస్థ తమ భద్రతకు విఘాతం కలిగిస్తోందని ఇజ్రాయిల్ ఆరోపిస్తూ వస్తోంది. ఆ సంస్థతో లేదా ఆ సంస్థతో సంబంధాలున్న మరే ఇతర సంస్థతోనూ సంబంధాలు కొనసాగించలేమని పేర్కొంది. కమ్యూనికేషన్, సహకార సంబంధాలు మొత్తంగా రద్దవుతాయని రాయబారి డేనీ డానన్ తెలిపారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశం కానున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

అధిక సుంకాలు విధిస్తా

- చైనా, భారత్, బ్రెజిల్‌కు ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్ : అమెరికా ప్రయోజనాలకు హానికలిగించే దేశాలపై అధిక సుంకాలు విధిస్తానని అధ్యక్షుడు ట్రంప్ బెదిరించారు. "అమెరికాకు హానికరంగా పరిణమించిన బయటి దేశాలపైన, వ్యక్తులపైన అధిక సుంకాలు విధిస్తాం. భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు అధిక సుంకాలు కలిగి ఉన్నాయి." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండోసారి అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా సోమవారం ప్రతినిధుల సభలో ట్రంప్ మాట్లాడారు. "వారేం చేస్తున్నారో చూడండి. చైనా, భారత్, బ్రెజిల్ ఇంకా చాలా దేశాలు అధికంగా సుంకాలు విధిస్తున్నాయి. కాబట్టి మనం అలా జరగడాన్ని ఇక ఎంత మాత్రమూ అనుమతించరాదు. అమెరికాను ప్రథమ స్థానంలో మనం నిలపాల్సి వుంది. మన ఖజానాలోకి డబ్బు వచ్చి పడే వ్యవస్థను మనం నెలకొల్పాలి. మరోసారి అమెరికా సుసంపన్నమైన దేశంగా నిలవాలి. అతి త్వరలోనే అది జరుగుతుంది." అని ట్రంప్ చెప్పారు. అమెరికాను మరింత సంపన్నమైన, శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలని, అటువంటి వ్యవస్థకు అమెరికా మళ్లీ మళ్లాలని అన్నారు. "విదేశాలను సుసంపన్నం చేసేందుకు మన పౌరులపై పన్నులు విధించే బదులు మన ప్రజలను సుసంపన్నులు చేసేందుకు విదేశాలపై పన్నులు విధించాలి." అని ట్రంప్ పేర్కొన్నారు.

"అమెరికా మొదటి ఆర్థిక నమూనా ప్రకారం, ఇతర దేశాలపై విధించే సుంకాలు పెరగాలి. అమెరికన్ కార్మికులపై, వ్యాపారాలపై విధించే పన్నులు తగ్గాలి. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, ఫ్యాక్టరీలు స్వదేశానికి రావాలి." అని ట్రంప్ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలపై వంద శాతమూ టారిఫ్‌లు విధించాలని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించారు. టారిఫ్‌లను నివారించాలని భావించినట్లైతే అమెరికాకు వచ్చి తయారీ యూనిట్లు పెట్టాల్సిందిగా ట్రంప్ కంపెనీలను కోరారు. "పన్నులు లేదా టారిఫ్‌లు చెల్లించరాదని మీరు భావించినట్లైతే, అమెరికాలో మీరు ప్లాంట్ పెట్టుకోవాల్సి వుంటుంది. అది కూడా రికార్డు స్థాయిలో జరగాలి. ఇంతవరకు ఎవరూ ఊహించని రీతిలో చాలా తక్కువ వ్యవధిలోనే ఎక్కువ ఫ్యాక్టరీలు పెట్టబోతున్నాం. ఎందుకంటే వారికి ఎలాంటి టారిఫ్‌లు లేకపోగా ప్రోత్సాహకాలు వుంటాయి." అని ట్రంప్ పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్లు, ఉక్కు వంటి రంగాల్లో కంపెనీలు పెట్టేందుకు అమెరికా మద్దతునిస్తుందన్నారు. అమెరికా మిలటరీకి అవసరమైన ఉక్కు, అల్యూమినియం, రాగి, ఇతర ఖనిజాలపై టారిఫ్‌లు విధించనున్నట్లు చెప్పారు. మళ్లీ మన దేశానికి ఉత్పత్తిని తీసుకురావాల్సి వుందన్నారు. గతంలో రోజుకు ఒక ఓడ తయారుచేసిన రోజులు వున్నాయి, కానీ ఈనాడు మనం ఓడను నిర్మించలేకపోతున్నాం, ఏం జరుగుతోందో నాకు అర్థం కావడం లేదు. అన్నీ ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్లిపోతున్నాయని ట్రంప్ అన్నారు. అమెరికన్ కుబేరులపై ఆస్తి పన్ను రద్దు చేసే అంశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ట్రంప్‌పై కేసు విచారించిన న్యాయ అధికారుల తొలగింపు

వాషింగ్టన్ : 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత తనపై నమోదైన కేసు దర్యాప్తును ముందుకుతీసుకెళ్లిన అధికారులపై ట్రంప్ కక్ష సాధింపు చర్యతో వేటు వేశారు. ప్రస్తుత అటార్నీ జనరల్ జేమ్స్ మెక్ హెన్రీతో పాటు, మరో 12 మంది అధికారులను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తమ ప్రభుత్వ అజెండాను ముందుకు తీసుకెళ్లే క్రమంలో వీరిని విశ్వసించలేమని ఈ ఆదేశాల్లో ట్రంప్ పేర్కొనడం విశేషం. తొలగింపునకు గురైన వారిలో మాజీ స్పెషల్ కౌన్సిల్ జాక్ స్మిత్ కూడా ఉన్నారు. ట్రంప్ ఎన్నికల ఓటమి తర్వాత దర్యాప్తునకు జాక్ స్మిత్ నాయకత్వం వహించారు. ట్రంప్‌పై స్మిత్ రెండు దర్యాప్తులు చేశారు. వీటిలోభాగంగా ట్రంప్‌పై స్మిత్ నేరారోపణలు చేశారు. 2020 ఎన్నికల ఫలితాలను ట్రంప్ ఉద్దేశపూర్వకంగా మార్చేందుకు యత్నించారన్నది దీనిలో ప్రధాన ఆరోపణ. దీంతోపాటు రహస్యపత్రాలను తనతోపాటు తీసుకెళ్లారన్నది మరో కేసు. అప్పట్లో ఈ దర్యాప్తులను ట్రంప్, ఆయన మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకించారు. నిజానికి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లలో ట్రంప్ తన రాజకీయ శత్రువుల పదవులకు ఎసరు పెట్టారు. అప్పుడే స్మిత్ బృందంపైనా వేటు ఖాయమనే సంకేతాలు వచ్చాయి.

సైనిక దళాల్లో కీలక మార్పులు..

అమెరికా మిలటరీని పునర్ వ్యవస్థీకరించాలని సోమవారం ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీంతోపాటు ట్రాన్స్‌జెండర్లు అమెరికా సాయుధ దళాల్లో పనిచేయకుండా నిషేధం విధించారు. కొవిడ్ వ్యాక్సిన్లు తీసుకోవడానికి నిరాకరించి చర్యలకు గురైనవారిని మళ్లీ దళాల్లోకి తీసుకొంటున్నట్లు ప్రకటించారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు వస్తున్న సమయంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన ఈ ఆదేశాలపై సంతకం చేసినట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. 2017లో కూడా ట్రంప్ ట్రాన్స్‌జెండర్లను సైనికదళాల్లో చేరకుండా నిషేధం విధించారు. అయితే, 2021లో జోబైడెన్ ఆ ఆదేశాలను నిలిపివేశారు. ట్రంప్ మళ్లీ అధికారం చేపట్టగానే బైడెన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొన్నారు. సోమవారం జారీ చేసిన ఆదేశాల్లో ట్రంప్ మరింత దూకుడు కనబర్చినట్లు తెలుస్తోంది.

30న అఖిలపక్ష సమావేశం

- 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అఖిలపక్ష సమావేశం ఈ నెల 30న జరగనుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత సమావేశాలు 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. రెండో విడత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. ఈ మేరకు మంగళవారం పార్లమెంటరీ బులిటెన్ విడుదలైంది. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడతారు. అదేరోజు ఎకనామిక్ సర్వేను ప్రవేశపెడతారు. అంతకుముందు రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు ఈ నెల 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీలూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిందని, ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపిలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతోపాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈసారి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధికార పక్షమే పార్లమెంట్‌ను స్తంభింపజేస్తూ... మంత్రి సుద్దులు చెబుతున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

పరువు నష్టం కేసులో అతిషికి ఊరట

న్యూఢిల్లీ : బిజెపి నాయకులు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషికి ప్రత్యేక కోర్టు మంగళవారం ఊరట కలిగించింది. ఈ కేసులో అతిషికి మేజిస్ట్రియల్ కోర్టు జారీ చేసిన సమన్లను ప్రత్యేక కోర్టు జడ్జి విశాల్ గోన్నే రద్దు చేశారు. బిజెపికి వ్యతిరేకంగానే అతిషి ప్రకటనలు చేశారని, వ్యక్తిగతంగా పరువునష్టం చేసే వ్యాఖ్యలు చేయలేదని అతిషి తరుపు న్యాయవాది చేసిన వాదనలను అంగీకరిస్తూ జడ్జి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. బిజెపి నాయకులు ప్రవీణ్ శంకర్ కపూర్ ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు.

తప్పుడు సమాచారం వ్యాప్తి నేరమే !

- కొత్త చట్టాన్ని ఆమోదించిన పాకిస్తాన్
- తప్పుబడుతున్న జర్నలిస్టు సంఘాలు

ఇస్లామాబాద్ : ఇకపై ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే దాన్ని పాకిస్తాన్ నేరంగా పరిగణించనుంది. ఈ మేరకు మంగళవారం ఒక చట్టాన్ని ఆమోదించింది. ఈ చర్యకు పాల్పడిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష కూడా విధించనున్నారు. జర్నలిస్టు సంఘాలు ఈ చర్యను తీవ్రంగా ఆక్షేపించాయి. తప్పుడు లేదా బూటకపు సమాచారమని నమ్మడానికి కారణం వున్నా లేదా భయాందోళనలు, అశాంతి సృష్టించే కారణంతో ఇలాంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని భావించిన పక్షంలో అటువంటి సమాచారాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వ్యాప్తి చేసే వారిని ఈ చట్టం లక్ష్యంగా చేసుకుంటుంది. గత వారం ఈ చట్టాన్ని నేషనల్ అసెంబ్లీ ఆమోదించగా మంగళవారం సెనెట్ ఆమోద ముద్ర వేసింది. గ్యాలరీలో కూర్చున్న జర్నలిస్టులు నిరసనగా బయటకు వాకౌట్ చేశారు. ఈ చట్టాన్ని ఆమోద ముద్ర వేసే ముందుగా విలేకర్లతో మాట్లాడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు మోసం చేసిందని, వెన్నుపోటు పొడిచిందని సీనియర్ జర్నలిస్ట్, పాకిస్తాన్ జర్నలిస్టుల సమాఖ్య సభ్యుడు అసిఫ్ బషీర్ చౌదరి విమర్శించారు. ఈ కొత్త చట్టం అత్యంత అప్రజాస్వామికమైనదని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ (పిటిఐ) నాయకుడు, సెనెటర్ అయిన సయ్యద్ షిబ్లి ఫరాజ్ వ్యాఖ్యానించారు.

1/70 చట్టంపై అయ్యన్న వ్యాఖ్యలు సరికావు

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యతారహిత వ్యాఖ్యలు

1/70 చట్టానికి సవరణలు చేయాలని సభాపతి స్థాయిలో ఉన్న అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం ముమ్మాటికీ బాధ్యతారాహిత్యం. ఏజెన్సీ భూములకు ఇప్పటికే రక్షణ కొరవడింది. రాజకీయ రాబంధుల భూకబ్జాలను నిరోధించడానికి గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు జరపాలి.

-రామారావు దొర, ఎపి ఆదివాసీ జెఎసి అల్లూరి జిల్లా కన్వీనర్

1/70 చట్టం జోలికొస్తే ఊరుకోం

1/70 చట్టం జోలికొస్తే ఊరుకోం. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. ఉన్నత స్థానంలో ఉండి గిరిజన విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడం దారుణం. ఆదివాసీ చట్టాలు, హక్కులపై వివాదాస్పద వ్యాఖ్యలు తగవు. ఆదివాసీ ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రను వ్యతిరేకిస్తున్నాం. గతంలో బాక్సైట్ తవ్వకాలకు అడ్డుగా ఉందని 1/70 చట్టానికి సవరణలు చేయాలని నాటి టిడిపి ప్రభుత్వం గిరిజన సలహా మండలిలో తీర్మానం పెట్టింది. అప్పటి సిపిఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. కుట్రపూరిత విధానాలను ప్రభుత్వం మానుకోవాలి.

-పి.అప్పలనర్స, సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి

స్పీకర్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి

స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం జోలికొస్తే ఊరుకొనేది లేదు. అయ్యన్న వ్యాఖ్యలు ఆదివాసీలకు తీవ్ర ద్రోహం చేసేవిగా ఉన్నాయి. 1/70 చట్టానికి సవరణలు చేస్తే ఆదివాసీ సహజ వనరులను, ఖనిజాలను, అడవులను పెట్టుబడిదారులు, కార్పొరేట్లు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తారు. ఆదివాసీ జీవన విధానం ధ్వంసమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047ని దృష్టిలో ఉంచుకుని షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్ట సవరణకు యత్నించడం తగదు. ఆ చట్టం అమల్లో ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో బినామీ పేర్లతో లాడ్జీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రిసార్టుల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. టూరిజం అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులు దోచుకుంటే ఊరుకోబోం. 1/70 చట్టం జోలికొస్తే టిడిపి కూటమి ప్రభుత్వానికి ఆదివాసీలు సరైన గుణపాఠం చెబుతారు.

-కిల్లో సురేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏజెన్సీలో నిరసన

స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన అరకులోయ మండలం శరభగుడలో గిరిజనులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడారు. టూరిజం అభివృద్ధికి గిరిజన చట్టాలకు సవరించాలనుకోవడం దారుణమన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

చిన్నారి

మీ కోసం

ఇంట్లో చేసుకున్న అల్లం వెల్లుల్ని పేస్టు నిల్వ ఉండాలంటే అందులో ఉప్పు, పసుపు వేసి కలిపి గాజు సీసాలో భద్రపరచాలి.

జీవన సౌరభం

చేసే పనిలో వచ్చే ఫలితాల పట్ల బాధ్యత పూర్తిగా ఆ పనిచేసే వారిపైనే ఉంటుంది.

ఆత్మవిశ్వాసం

వాసు 6వ తరగతి చదువుతున్నాడు. అన్నింట్లో ముందుండేవాడు. చదువులోనైనా, ఆటల్లో అయినా తనవే అన్ని బహుమతులు. పరుగు పందెంలో ఎదుటివారిని సులభంగా ఓడించేవాడు. అయితే, వాసు 6వ తరగతి చదువు తున్నప్పుడు వాళ్ల తరగతిలో విజయ్ అనే విద్యార్థి చేరాడు. తను వాసుకి ప్రతి విషయంలో మంచి పోటీ ఇచ్చేవాడు.

గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలలో ఆటలు ఆడించారు, అందులో పరుగు పందెం కూడా పెట్టారు. పోటీలో పాల్గొంటామని విజయ్, వాసు పేర్లు ఇచ్చారు. అయితే, వాసు స్నేహితులు 'విజయ్ నీకన్నా బాగా పరిగెడతాడు. ఇంతకు ముందు జిల్లా స్థాయి పరుగు పందెంలో కూడా విజయ్ ప్రథమ బహుమతిని పొందాడు' అని వాసుతో చెప్పారు. వాసుకి ఆ మాటలు మనసులో బాగా నాటుకుపోయాయి. తను విజయ్ కన్నా వేగంగా పరుగెత్తలేనేమోనని అనుకున్నాడు. పరుగు పందెం పెట్టే రోజు రానే వచ్చింది. పరుగు పందేన్ని నిర్వహించారు. వాసు, విజయ్ ఇద్దరు బాగా పరుగెడుతున్నారు. అయితే వాసు, విజయ్ తనకన్నా వేగంగా పరుగెడతాడన్న ఆలోచనతో విజయ్ వైపే చూస్తూ, పరుగు మీద ఏకాగ్రతను కోల్పోయాడు. దీంతో, పోటీలో వాసు మీద విజయ్ గెలిచాడు. అప్పుడు విజయ్ వాసు దగ్గరికి వచ్చి 'నువ్వు నాకన్నా చక్కగా పరిగెడుతున్నావ్ కానీ నేనెక్కడ నీకన్నా బాగా పరుగెడతానో అన్న ఆలోచనతో నా వైపు చూస్తూ, పరుగుపై ఏకాగ్రత కోల్పోయావు. ఓడిపోయావు' అని చెప్పాడు. వాసుకు ఇది నిజమే అనిపించింది. పోటీలో గాని చదువులో గాని ఆత్మవిశ్వాసం కోల్పోతే అపజయం ఎదురవుతుందని ఆ రోజు వాసుకు అర్థమైంది.

– బెందాళం సిద్దార్థ్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ముత్యాల పేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.



దారి చూపండి

పిల్లలూ, బయట ఉన్న కుందేలు బాక్స్‌లోపల ఉన్న తన ఇంటికి చేరుకోవాలి. దానికి దారి చూపించరూ..

నేను గీసిన బొమ్మ

శ్రీహరి,
5వ తరగతి,
గ్లోరీ మెట్రిక్యులేషన్స్ హెచ్‌ఆర్‌సెక్షన్ స్కూల్,
తిరుత్తంగళ్,
విరుధునగర్ జిల్లా,
తమిళనాడు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చదువు కోసం..

చదువు చాలామంది పిల్లలకు చాలా దగ్గరగా ఉంటుంది. కొంతమంది పిల్లలకు మాత్రం అందనంత దూరంలో ఉంటుంది. అయినా దూరాన్ని లెక్కచేయకుండా చదువుకునేందుకు వాళ్లు చేసే ప్రయాణం, చదువుకోవాలనుకునే కోరిక కంటే చాలా ఎక్కువ. ఇటీవల సోషల్ మీడియాలో ఉత్తరాఖండ్‌లో ఓ మారుమూల పల్లె నుండి స్కూలుకు వెళ్లేందుకు ఇద్దరు ఆడపిల్లలు పడుతున్న అవస్థను ఓ వ్యక్తి వీడియో తీసి వైరల్ చేశాడు. ఆ దృశ్యం, ఒకపక్క ఆ పిల్లల చదువు కోరికను బలంగా చూపిస్తుంటే, మరోపక్క సాంకేతికత అందిపుచ్చుకున్న 2025వ సంవత్సరంలో కూడా కనీస మౌలిక వసతులు లేని గ్రామాల దుర్భర పరిస్థితులను కళ్లముందుంచుతోంది.

తొమ్మిదో తరగతి, ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు ఆడపిల్లలు, కొండపై నిర్మించిన తాళ్లతో నడిచే ఓ ట్రాలీ గొలుసులను ఎవరి సాయం లేకుండా లాగుతూ కనిపిస్తున్నారు. చాలా బలంగా లాగితేగాని అవి రావడం లేదు. చేతులు ఒరుసుకు పోతున్నాయి. అయినా ఒకరి తరువాత ఒకరు, ఒకరి సాయంగా మరొకరు ఓ పది ఇనుప లింకులను లాగారు. దగ్గరకు వచ్చిన ట్రాలీ ఎక్కి అవతలి వైపుకు వెళ్లారు. అటువైపు ఉన్న ఓ వ్యక్తి పిల్లలెక్కిన ట్రాలీని లాగడం వీడియోలో కనిపిస్తోంది.

ఇండియన్ ఆర్మీలో చేరాలని ఓ బాలిక ఆశ పడుతుంటే, టీచర్‌గా చేస్తానని మరో బాలిక ఉబలాటపడుతోంది. చదువు వాళ్ల కోరికలను నెరవేస్తుంది అని ఆ చిన్నారులు బలంగా నమ్ము తున్నారు. అందుకే ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు.

ఉత్తరాఖండ్ మున్సియారీ గ్రామం కొండప్రాంతం. ఆ కొండపై సుమారు 70 గ్రామాలు ఉన్నాయి. ఆ ప్రజలంతా ప్రపంచాన్ని చూడాలంటే ఓ నదిని దాటాలి. 2013 వరకు అక్కడో వంతెన ఉంది. ఆ తరువాత అది కూలి పోయింది. దశాబ్దం గడుస్తున్నా అక్కడ బ్రిడ్జి వేయలేదు. ఈ పరిస్థితుల్లో తాత్కాలిక ప్రయాణమార్గంగా ఓ తాడుకు ట్రాలీని ఏర్పాటుచేశారు. బలమైన ఇనుపగొలుసులతో నిర్మించిన ఆ తాడుపై గాలికి ఊగుతూ, తూలుతూ, కొండకు సమాన ఎత్తులో అది వెళుతుంది.

దేశంలో ఎన్నో గ్రామాల్లో ఇప్పటికీ స్కూలుకు వెళ్లే పిల్లలు నానావస్థలు పడుతున్నారు. వాగులు, వంకలు దాటుతూ, ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు. మౌలిక వసతులు లేక, ఎప్పుడో తాతలు, తండ్రుల కాలంలో ఉన్న ఈ పరిస్థితులు సాంకేతికత అందిపుచ్చుకున్న ఈకాలంలో కూడా కొనసాగడం సిగ్గుచేటు. 'ఇదీ మన వ్యవస్థ.. 2025 భేటీ బచావో.. భేటీ పడావో ఇదే..' అంటూ ఉత్తరాఖండ్ చిన్నారుల వీడియో తీస్తున్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలు వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

పీచే కదాని పారేయకండి..

మొక్కజొన్నలో చాలా లాభాలు ఉంటాయని మనకు తెలుసు. అయితే దాని పీచులో కూడా మన ఆరోగ్యానికి మేలు చేసే లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మొక్కజొన్న పీచు ఉడికించి ఆ నీటిని తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మొక్కజొన్న పీచులో పొటాషియం, కాల్షియం, విటమిన్ బి2, సి, కె వంటి పోషకాలు ఉంటాయి. దీన్ని 5000 సంవత్సరాల క్రితం అనేక అనారోగ్యాల చికిత్సల్లో వాడేవారు.

- మొక్కజొన్న పీచులో ఉండే యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్, మూత్రంలో మంట వంటి సమస్యలను తగ్గిస్తుంది. అలాగే యూరిన్‌లో ఉండే బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. మన శరీరంలో ఉన్న అదనపు నీరు, వ్యర్థాలను బయటకు పంపిస్తుంది.
- ఈ నీరు తీసుకోవడం వల్ల కిడ్నీలో ఉండే నైట్రేట్లు, టాక్సిన్స్ తొలగిపోతాయి. ఇది కిడ్నీలో రాళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎవరికైనా కిడ్నీలో రాళ్ల ఇబ్బంది పెడుతూ ఉంటే, మొక్కజొన్న పీచు మరిగించి నీటిని తీసుకోవడం వల్ల ఆ సమస్యను తగ్గించుకోవచ్చు.
- రక్తపోటును నియంత్రించడంలో కూడా మొక్కజొన్న పీచు నుండి తయారు చేసిన నీరు ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే మినరల్స్ రక్త ప్రసరణను మెరుగుపరచడంలో బాగా సహాయ పడతాయి.
- బరువు తగ్గాలనుకునే వారు మొక్కజొన్న పీచు ఉడికించిన నీరు రోజూ తాగితే ఫలితం ఉంటుంది.
- శరీరంలో ఇన్ఫ్లమేషన్, వాటర్ రిటెన్షన్ సమస్యను నయం చేస్తుంది.
- శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్, అదనపు కొవ్వును తగ్గిస్తుంది. ఎలాంటి కొవ్వునైన తగ్గించడానికి బాగా సహాయపడుతుంది.
- కొంత మందికి ఆహార పదార్థాలు తీసుకున్న తరువాత మంటగా అనిపిస్తుంది. అలాంటి వారు మొక్కజొన్న పీచు నీరు తాగాలి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శరీర మంటను తగ్గిస్తాయి.
- చాలా మందికి ఎంత లైట్ ఫుడ్ తీసుకున్నప్పటికి అరుగుదల సరిగా ఉండదు. అలాంటి వారు మొక్కజొన్న పీచు నుంచి తయారు చేసుకున్న నీరు తాగితే ఆ సమస్య తగ్గుతుంది.
- మధుమేహంతో బాధపడే వారికి కూడా ఈ పీచు నీరు బాగా ఉపయోగపడుతుంది. రక్తంలో చక్కెరను అదుపు చేసే లక్షణాలు ఈ నీళ్లల్లో ఉన్నాయి. అంతేకాక, ఇన్సులిన్ సెన్సిటివిటీ కూడా మెరుగుపరుస్తాయి.

నిమ్మకాయతో ఫ్రిజ్ సంరక్షణ

అందం నుంచి ఆరోగ్యం వరకూ.. నిమ్మకాయ ఎన్నో విధాలుగా ఉపయోగ పడుతుంది. వంటల్లోనే కాకుండా.. వంటగదిని శుభ్రం చేయడంలోనూ సాయపడుతుంది. 'ఫ్రిజ్'ను తాజాగా ఉంచడంలోనూ నిమ్మకాయ భేషుగ్గా పనిచేస్తుంది. దీనిని ముక్కలుగా కోసి ఫ్రిజ్‌లో ఉంచితే.. అనేక ప్రయోజనాలు అందిస్తుంది. అవేంటో చూద్దాం..

- నిమ్మకాయలో ఉండే యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు.. ఫ్రిజ్‌లో తిష్టవేసిన బ్యాక్టీరియాను తొలగించడంలో సాయ పడతాయి. ఇతర ఆహార పదార్థాలపైనా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.
- ఫ్రిజ్ నిర్వహణ ఎంత బాగున్నా.. కొన్నిసార్లు దుర్వాసన ఉంటుంది. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహార పదార్థాలపైనా ఈ వాసన ప్రభావం చూపుతుంది. ఈ సమస్యకు నిమ్మకాయ చెక్ పెడుతుంది. నిమ్మకాయను ముక్కలుగా కోసి ఫ్రిజ్‌లో ఉంచితే, ఇందులోని సిట్రిక్ యాసిడ్.. ఫ్రిజ్‌లో దుర్వాసనను దూరం చేస్తుంది. లోపలి గాలిని తాజాగా, సువాసనగా మార్చేస్తుంది.
- కొన్ని రకాల ఆహార పదార్థాలు ఫ్రిజ్‌లో ఉంచినా.. ఎక్కువ రోజులు ఉన్నా చెడిపోతాయి. అలాంటివాటిని ఎక్కువకాలం తాజాగా ఉంచేందుకు.. నిమ్మకాయలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు సమర్థంగా పనిచేస్తాయి. ఆహార పదార్థాలు కుళ్లిపోకుండా కాపాడతాయి. అయితే, ఫ్రిజ్‌లలో ఉంచడానికి తాజాగా, శుభ్రంగా ఉండే నిమ్మకాయలను మాత్రమే ఉపయోగించాలి.

వైభవంగా శంబర జాతర

- పోటెత్తిన సందర్శకులు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సిరిమానుపై అధిరోహించిన పూజారి రామారావు

శంబర వీధుల్లో తిరుగుతున్న పోలమాంబ సిరిమాను

ప్రజాశక్తి- మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

గిరిజన దేవతగా ప్రసిద్ధిగాంచిన పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరం పార్వతీపురం మన్యం జిల్లా శంబరలో మంగళవారం వైభవంగా జరిగింది. ఈ జాతరను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుండి కూడా వేలాదిగా గిరిజనులు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి గుమ్మడి సంధ్యారాణి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు అనంతరం కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారి ఘటాలను మోశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమాను సంబరం మొదలైంది. అమ్మవారి ఘటాలను చదురు గుడి నుంచి సిరిమాను వద్దకు, అనంతరం అక్కడి నుంచి తిరిగి చదురు గుడి వద్దకు చేర్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు, గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులు పూజారి జన్ని పేకాపు రామారావును భుజాలపై మోసుకొని వచ్చి సిరిమాను అధిరోహింపజేశారు. పురవీధుల్లో తిరిగాక సాయంత్రం ఆరు గంటలకు సిరిమానోత్సవం ముగిసింది. మారుజాతర వరకు చదురు గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వేలాది మంది బారులు తీరారు. ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్‌పి మాధవరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఎఎస్‌పిలు దిలీప్ కిరణ్, అంకిత సురాన, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి సిరిమాను వెంట తిరిగి కార్యక్రమం ముగిసినంత వరకు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అట్టహాసంగా 38వ జాతీయ క్రీడలు ప్రారంభం

- ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాని
- 450చొప్పున స్వర్ణ, రజత, కాంస్య పతకాలకు పోటీపడనున్న అథ్లెట్లు
- 14 క్రీడలు 32 ఈవెంట్లకు ప్రాతినిధ్యం

ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా మిరుమిట్లు గొలిపే లేజర్ షో (ఇన్‌సెట్‌లో జాతీయ క్రీడలలోగో)

డెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడలు ఉత్తరా ఖండ్‌లోని డెహ్రాడూన్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మంగళవారం జరిగిన ప్రారంభోత్సవ వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమే లక్ష్యంగా నిలవాలని, అథ్లెట్లు ఆ స్థాయిలో ప్రదర్శనను చూపాలని ఆకాంక్షించారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' అంటూ నినదించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో కలిసి ప్రధాని జాతీయ క్రీడలను ప్రారంభించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రీయ పక్షి హిమాలయన్ మౌనాల్(నెమలి) 'మౌలి' పేరుతో మస్కట్ ప్రారంభోత్సవ వేడుకల్లో విశేషంగా ఆకర్షించింది. ఫిబ్రవరి 14వరకు జరిగే జాతీయ క్రీడల్లో 450 స్వర్ణ, 450 రజత, 450 కాంస్య పతకాల సాధనకు 10వేలకు పైగా అథ్లెట్లు పోటీపడను న్నారు. మొత్తం 14 క్రీడలకు సంబంధిం చి 32 ఈవెంట్లు జరగనుండగా.. ఉత్తరాఖండ్ కొండప్రాంతంలోని ఏడు నగరాల్లో జాతీయ క్రీడా పోటీలు జరగనున్నాయి.

ఖేల్‌రత్నకు
జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోండి

- కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖకు ఆదేశిస్తూ... హైకోర్టు తీర్పు చెప్పింది. 2023 ఏడాదికి బాడ్మింటన్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ చంద్రశేఖర్ శెట్టిలతో పాటు వెన్నం జ్యోతి సురేఖ పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలంది. ఆ అవార్డుకు ఎంపికైన వారి కంటే జ్యోతి సురేఖ ప్రతిభావంతురాలని పేర్కొంది. 2024 సంవత్సరం కూడా ముగిసినందున 2023 సంవత్సరం నాటి సెలక్షన్‌ను కొట్టేయడం సరికాదంది. తిరిగి దరఖాస్తు చేసుకోవాలని జ్యోతి సురేఖను ఒత్తిడి చేయొద్దని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు. గతేడాది జ్యోతి సురేఖ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరించారు. పాయింట్ల ప్రకారం చూసుకుంటే సురేఖకు 148.74 శాతం మార్కులు వస్తాయన్నారు. అవార్డుకు ఎంపికైన సాయిరాజ్, చిరాగ్ శెట్టీలకు 58.5 మార్కులే వచ్చాయన్నారు. ఎంపిక విధానానికి విరుద్ధంగా కమిటీ వ్యవహరించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జ్యోతి సురేఖ అధిక మెడల్స్ సాధించినా ఆమె పేరును అవార్డుకు ఎంపిక చేయకపోవడం చెల్లదన్నారు.

సెంచరీలో చరిత్ర పుటల్లో త్రిష

- ఐసిసి మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్

కౌలాలంపూర్: మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో తెలుగమ్మాయి, హైదరాబాద్‌కు చెందిన గొంగడి త్రిష అదరగొట్టింది. స్కాట్‌లాండ్‌తో మంగళవారం జరిగిన సూపర్ సిక్స్ మ్యాచ్‌లో కేవలం 53బంతుల్లోనే సెంచరీ బాదింది. దీంతో ఐసిసి మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో సెంచరీ కొట్టిన తొలి క్రికెటర్‌గా చరిత్ర పుటల్లోకెక్కింది. అదే సమయంలో బంతితోనూ రాణించి మూడు వికెట్లు పడగొట్టింది. దీంతో టీమిండియా 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సెమీస్‌కు చేరింది. స్కాట్లాండ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా.. టీమిండియా ఓపెనర్లు కమలిని, గొంగడి త్రిష చెలరేగి ఆడారు. ఓపెనర్లు కమలినీ తొలి వికెట్‌కు 147 పరుగులు జోడించారు. త్రిష 59బంతుల్లోనే 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. 13ఫోర్లు, నాలుగు సిక్సర్లతో కమిలిని 42 బంతుల్లో 51 పరుగులు చేశారు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఛేదనలో స్కాట్లాండ్ 58 పరుగులకే కుప్పకూలింది. ఆయుషి శుక్లా మూడు 8 పరుగులు ఇచ్చి కీలకమైన నాలుగు వికెట్లు, వైష్ణవి శర్మకు మూడు, త్రిషకు మూడు వికెట్లు దక్కాయి. శుక్రవారం జరిగే సెమీస్‌లో భారతజట్టు ఇంగ్లండ్‌తో, దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాతో తలపడనున్నాయి.

అగ్రిమెంట్ ఫిక్స్

రాజమౌళి, మహేశ్‌బాబు కాంబో 'ఎస్‌ఎస్‌ఎంబి 29' అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో రెండు భాగాలుగా రానుంది. తొలి భాగం ప్రేక్షకుల ముందుకు రావడానికి కనీసం రెండేళ్లయినా పట్టొచ్చని టాక్! ఇటీవలె షూటింగ్ షురూ అంటూ రాజమౌళి ఓ పోస్ట్ చేశారు. తాజాగా చిత్రబృందంతో ఓ అగ్రిమెంట్ తీసుకున్నాడని తెలుస్తోంది. అగ్రిమెంట్ ప్రకారం.. ఎట్టి పరిస్థితుల్లోనూ కథ, షూటింగ్ క్లిప్స్, సినిమాలో నటించేవారి గురించిన ఎలాంటి వివరాలు బయటకు రాకూడదు. ఈ విషయంలో చిత్రయూనిట్‌కు హెచ్చరికలు జారీ చేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణులతో నాన్ డిస్‌క్లోజ్ అగ్రిమెంట్ చేయించినట్లు తెలుస్తోంది. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాతోనూ ఈ ఒప్పందంపై సంతకం చేయించారని సమాచారం! ఈ అగ్రిమెంట్ ప్రకారం సినిమాకు సంబంధించిన ఏ చిన్న విషయాన్ని కూడా యూనిట్ సభ్యులు బయటకు చెప్పేందుకు వీల్లేదు. దర్శకనిర్మాతల అనుమతి లేకుండా ఎవరైనా సమాచారాన్ని లీక్ చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. అలాగే హీరోతో సహా సెట్‌లో ఉన్న ఎవరూ ఫోన్లు తీసుకురావడానికి అనుమతి లేదని తెలుస్తోంది.

ప్రతి స్త్రీ ప్రతిరోజూ వీటిని ఎదుర్కొంటుంది

ఫాతిమా సనా షేక్

బాలీవుడ్ చిత్రం 'దంగల్' సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఫాతిమా సనా షేక్ కాస్టింగ్ కౌచ్‌ని ఎదుర్కొన్నట్లు తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'నువ్వు నేను ఒక్కటవుదాం' అనే చిత్రంతో ఆమె టాలీవుడ్‌కి పరిచయం అయ్యారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ కెరీర్ ప్రారంభంలోనే 'క్యాస్టింగ్ కౌచ్'ను ఎదుర్కొన్నట్లు చెప్పారు. హైదరాబాద్ వచ్చినప్పుడు ఓ నిర్మాత మాటలకు తాను ఇబ్బంది పడినట్లు తెలిపారు. 'ఇండస్ట్రీలో కొత్త వారికి అవకాశం రావడం చాలా కష్టం. ఒకవేళ ఎంతో కష్టపడి అవకాశం అందుకున్నా రిఫరెన్స్ పేరుతో నిర్మాతలే 15 శాతం పారితోషికాన్ని తీసుకుంటారు. బాలీవుడ్ లోకి రావడానికి ముందు సౌత్ ఇండస్ట్రీలో ఓ అవకాశం వచ్చింది. అది నా కెరీర్‌ను మలుపు తిప్పుతుందని అనుకున్నా. హైదరాబాద్‌లో ఆ చిత్ర నిర్మాతను కలిసినప్పుడు ఆయన నాతో అనుచితంగా ప్రవర్తించారు. 'మీకు అవకాశం కావాలంటే ప్రతి పనిని చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఏది చేయడానికైనా అంగీకరించాలి' అన్నారు. సినిమాకు ఏం అవసరమైనా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాను. ఆ నిర్మాత క్యాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడారు. దాంతో ఇబ్బంది పడి మౌనంగా వచ్చేశాను. లైంగిక వేధింపుల కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయా. ఈ తరహా పరిస్థితులు చిత్ర పరిశ్రమలోనే కాదు అన్ని రంగాల్లోనూ ఉన్నాయని తర్వాత అర్థం అయింది. ప్రతి స్త్రీ ప్రతిరోజూ వీటిని ఎదుర్కొంటుంది' అన్నారు.

'రాపిడో.. పడిపోయా ప్రేమలో...'

'మనసు చూసిన దొంగ చూపులు దాచలేను..కనులు దాచిన అందాన్ని అరచేతిలో చెరిపేయలేను.సరదాగా సైగలు..పెదాలపై నవ్వులు మోయలేను...కలిసే రోజు కోసం..ఎదురపడి ఎదురుచూపుల కోసం..ఒకటే ఆలోచనలు...ఒకటే మంతనాలు..' అంటూ సరదాగా సాగే ప్రేమ ప్రయాణాల సాగరమే 'రాపిడో పడిపోయా ప్రేమలో...' సినిమా. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం దువ్వాడ రాము సారథ్యంలో మద్దాల అప్పన్న నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కుతోంది. జబర్దస్త్ టీంలోని రైజింగ్‌రాజు, గడ్డం మురళి, గుండు మురళి, త్రినాథ్, డాక్టర్ కుమార్‌నాయక్ నటిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది.

ఛేదనలో తడబడ్డ టీమిండియా

- మూడో టి20లో ఇంగ్లండ్ గెలుపు

రాజ్‌కోట్: టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ టి20ల్లో పునరాగమనం చేసినా.. వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లతో అద్భుత ప్రదర్శనతో మెరిసినా.. మూడో టి20లో టీమిండియా పరాజయాన్ని చవిచూసింది. తొలి రెండు టి20ల్లో నెగ్గి ఐదు సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న టీమిండియా ఆశలపై ఇంగ్లండ్ నీళ్లు చల్లింది. మంగళవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 26 పరుగుల తేడాతో అనూహ్య పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను 171పరుగులకే పరిమితం చేసినా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 145 పరుగులే చేయగల్గింది. ఛేదనలో భాగంగా టీమిండియా బ్యాటర్లు హార్దిక్(40), అభిషేక్(24) మినహా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి ఐదు వికెట్లను 85పరుగులకే కోల్పోయిన టీమిండియా ఆ తర్వాత రక్షణాత్మక ధోరణితో ఆడి ఓటమిపాలైంది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. ఓపెనర్ డకెట్(51) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ బట్లర్(24), లివింగ్‌స్టోన్(43) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. 3వికెట్ల నష్టానికి 108పరుగులతో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్‌ను వరుణ్ చక్రవర్తి(5/24) అద్భుత బౌలింగ్‌తో కట్టడి చేశాడు. దీంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యాకు రెండు, రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యతలో ఉండగా.. నాల్గో టి20 పూణే వేదికగా శుక్రవారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తికి దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68